తీన్మార్
తెలుగు దినపత్రిక

# ఉరుముతున్న నిరుద్యోగం

ప్రపంచంలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నా ఉరుముతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫలం కాలేకపోతున్నాయి. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తవుతాయి. స్వతంత్ర భారతం అనేక రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించినా భారత్‌లో తయారీ వంటి ఆకర్షణీయ నినాదాలిస్తున్నా తదనుగుణంగా ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో ముఖ్యంగా తయారీ రంగంలో మేటిగా నిలవలేక ఇంకా అనేక వస్తువులను చైనా తదితర దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా కోట్లాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రస్తుతం 5 వ స్థానంలో వున్న ఆర్థిక వ్యవస్థను వచ్చే 24 ఏళ్లలో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ప్రపంచంలో 3 వ స్థానానికి చేర్చడమే లక్ష్యంగా సంకల్పం చెప్పుకొని ఆ దిశగా కొన్ని చర్యలు చేపట్టారు. అయితే ఇవి లక్ష్య సాధనకు ఏ మేరకు ఉపకరిస్తాయనేదే ప్రశ్న. నిరుద్యోగ సమస్య తీవ్రత దృష్ట్యా పాలస్తీనా వివాదంలో ఇస్లామిక్ దేశాలతో పోరాడుతున్న ఇజ్రాయెల్ దేశంలో వివిధ రంగాలలో ముఖ్యంగా నిర్మాణ రంగంలోకి పని చేయడానికి భారత యువత ఎగబడటం చూస్తే నిరుద్యోగ పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. ఇజ్రాయెల్ నిర్మాణ రంగంలో పని చేయడానికి 10 వేల మందికి పైగా ప్లంబర్లు, ఎలక్ట్రిషియన్లు, కార్పెంటర్లు, పెయింటర్ల వంటి వివిధ వృత్తులవారు అవసరం కాగా, ఆ పనుల్లో చేరడానికి తొలుత 25 కోట్ల జనాభా గల అతి పెద్ద రాష్ట్రం యుపి, హర్యానా యువకులు ఎగబడ్డారు. కాగా ఇజ్రాయెల్‌తో స్నేహ సుహృద్భావ సంబంధాలు నెరపుతున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం చొరవ తీసుకుని బిజెపి ఏలుబడిలోని యుపి, హర్యానాలో కార్మికుల రిక్రూట్‌మెంట్‌లో ఇజ్రాయెల్‌కు తమ సహకారాన్ని అందించింది. పాలస్తీనా సంఘర్షణలో ఇస్లామిక్ దేశాలు, ఇజ్రాయెల్ పరస్పరం బాంబు, క్షిపణి దాడులకు దిగడంతో అక్కడ భీతావహ పరిస్థితులు నెలకొన్నా అక్కడ పని చేయడానికి మన నిరుద్యోగ యువత పోటీపడుతున్నది. ఒక్కో ఉద్యోగికి నెలకు రూ. 1.40 లక్షల జీతం, రూ. 4 వేల వరకు బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఎంపిక జరుగుతున్న చోట్ల తొక్కిసలాట జరుగుతున్నది. ఆకలితో మరణించడం కంటే పనిచేస్తూ ప్రాణాలు పోగొట్టుకోవడానికి యువత సిద్ధపడటం నిరుద్యోగ తీవ్రతకు నిదర్శనం. వివిధ దేశాలలో నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం గల కార్మికులకు మెరుగైన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండటంతో బతుకు కోసం ఆ దేశాలకు తరలి వెళ్ళడానికి యువత పోటీపడుతున్నారు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు గల్ఫ్, తదితర దేశాలలో పని చేస్తూ తమ కుటుంబాలకు వేల కోట్ల రూపాయలు పంపి ఆదుకుంటున్నారు. దేశంలో తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలులేకే యువత విదేశాల బాట పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014లో అధికారంలోకి రావడానికి ముందు బిజెపి తమ ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. అయితే వాస్తవంగా జరిగింది వేరు. దేశంలో తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక కన్సల్టెన్సీలకు వేల కొద్దీ డబ్బు చెల్లించి మన యువత విదేశాలకు తరలి వెళుతున్నారు. ధనదాహంతో కొన్ని కన్సల్టెన్సీలు అవకాశాలు లేని దేశాలకు కూడా యువతను పంపడం, అక్కడికి చేరాక వారు అష్టకష్టాలు పడటం తెలిసిందే. కెనడా, అమెరికా వంటి దేశాలకు వెళ్లినవారికి సైతం తగిన ఉద్యోగాలు లభించక అర్ధాకలితో అలమటిస్తూ, అప్పుల పాలై మళ్లీ స్వస్థలాలకు తిరిగి వస్తున్నవారు గణనీయంగా ఉన్నారు. 2022 అక్టోబర్ -2023 సెప్టెంబర్ మధ్య అమెరికాలో అక్రమంగా ప్రవేశించిన 96,917 మందిని గుర్తించి పట్టుకున్నట్లు అమెరికన్ కస్టమ్స్, సరిహద్దు భద్రతాదళం గణాంకాలు ఘోషిస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నా ఇది ఉద్యోగ, ఉపాధి కల్పించలేని అభివృద్ధిగా మిగిలిపోతున్నది. 2024- 25లో మన దేశం 7.3% అభివృద్ధి సాధించగలదని ఇటీవల తాత్కాలిక బడ్జెట్ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. కోట్లాది యువతకు, శ్రామికులకు ఉద్యోగ, జీవనోపాధి అవకాశాలు కల్పించలేనిదిగా నిలవనుంది. చదువుకున్న నిరుద్యోగ యువత మాత్రం తమ అర్హతలకు అనుగుణమైన ఉద్యోగాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. పనిచేసే వయసు గల యువతకు తగిన ఉపాధి అవకాశాలు లభించకపోతే అది వారిలో నైరాశ్యానికి , అశాంతికి దారితీసే ప్రమాదముంది. భారత ప్రభుత్వం రెండేళ్ల క్రితం సైన్యంలో చేరదలచిన యువతకు అగ్నిపథ్ పథకాన్ని ప్రకటించగా వేలాది మంది యువత ముందుకొచ్చారు. మామూలు సైన్యంలో ఇచ్చే జీత భత్యాలు, పింఛను వీరికిరావు. బిజెపి ప్రభుత్వం ఎక్కువగా వాణిజ్య, పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నందున, అగ్నిపథ్‌లో శిక్షణ పొందినవారు ఐదేళ్ళ తర్వాత పరిశ్రమల వారికి రక్షకులుగా పని చేయాల్సి ఉంటుంది. 13 కోట్ల జనాభా గల పెద్ద రాష్ట్రంలో పరిమితమైన రైల్వే ఉద్యోగాలకోసం యువత ఎగబడడంతో అది హింసాకాండకు దారి తీసింది. ఆరేళ్ల క్రితం 35 వేల ఉద్యోగాల కోసం ప్రకటన రాగా కోటి మంది దరఖాస్తు చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 368 బంట్రోతు ఉద్యోగాలకు ప్రకటన చేయగా పిహెచ్‌డిలు, పోస్టు గ్రాడ్యుయేట్లు సహా 23 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి. దేశంలో మొత్తం నిరుద్యోగిత రేటు 6.6%. నగరాలు, పట్టణాలలో 15- 19 ఏళ్ల ఉద్యోగార్థులు రేటు అంతకు 3 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు 2023 జులై సెప్టెంబర్ గణాంకాలు ఘోషిస్తున్నాయి. నిరుద్యోగ సైన్యం నానాటికీ పెరిగిపోతుండడం అనేక సమస్యలకు దారితీస్తున్నది. 2014లో యువత కోటి ఆశలతో కమలం పార్టీకి ఓటేయడంతో నరేంద్ర మోడీ ప్రధానిగా కేంద్రంలో కమలనాథులు అధికారంలోకి వచ్చారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం మోడీ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం కావాలి. అయితే అరకొర చర్యలు తప్పితే మోడీ ప్రభుత్వం ఈ రంగంలో పెద్దగా పురోగతి సాధించలేదు. ఉద్యోగాలు కల్పించినా కొన్ని అసంఘటిత రంగంలో పట్టణాలు, నగరాలలో అసంఘటిత రంగంలో రోజువారీ కూలీ పనులే, మహిళలే అధికం. 2019 - 20లో 22 శాతంగా ఉన్న ఈ పనులు 2022 -23లో 24 శాతానికి పెరిగినట్లు పరిశీలనలో తేలింది.

# మాల్ ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న నల్లవెల్లి మాజి సర్పంచ్ దేరంగుల రాజు**





యాచారం, ఫిబ్రవరి 17(తీన్మార్ న్యూస్): యాచారం మండలం, మాల్, తమ్మలోనిగూడెం గ్రామ పంచాయితీ పరిధి లోని సెయింట్ స్టీఫెన్స్ హైస్కూల్ ఎదురుగా ఉన్న మైదానంలో శనివారం రోజు మాల్ ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. నల్లవెల్లి మాజి సర్పంచ్ దేరంగుల రాజు ముఖ్య అతిథిగా పాల్గొని బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ దేరంగుల రాజు మాట్లాడుతూ ఆరోగ్యానికి, దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని చెప్పారు. యువత విద్యతో పాటు క్రీడా రంగంలో మంచి నైపుణ్యత రాణించాలి అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మీ ప్రదర్శనలు తీయాలని, భవిష్యత్తులో ఇలా రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి ఇక్కడి ప్రాంతానికి కూడా మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే, ఓడిపోయినా నిరుత్సాహం పడకూడదు, గెలిచాము అని గర్వపడవద్దు, స్నేహపూర్వకంగా క్రీడలను ఆడాలి, ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలి అని పేర్కొన్నారు. ఈ యొక్క కార్యక్రమం లో రాపోతు యాదగిరి, గడ్డం శ్రీధర్ రెడ్డి, సిరమోని శేఖర్, మారగోని శేఖర్, గెనమోని పెద్దులు, టోర్నమెంట్ నిర్వాహకులు ముద్దం శ్రీధర్, చిన్నోల చిన్న, శ్రీను, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాచకొండ పోలీసు కమిషనర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్స్

రంగారెడ్డి, ఫిబ్రవరి 17(తీన్మార్ న్యూస్): రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి,ని రాచకొండ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్స్ శనివారం రోజు మర్యాద పూర్వకముగా కలిసారు. రాచకొండ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్స్ రాచకొండ పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు గురించి తెలియజేయగా మార్చ్ 05 నాడు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదే విధముగా పోలీస్ సొసైటీ ఎన్నికల గురించి వినతి పత్రం అందజేసారు. దీనిపైన వెల్ఫేర్ అడిషనల్ డీజీపీ సార్ తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. పోలీస్ సిబ్బంది కి రావాల్సిన టి ఏ బిల్లులు, సరెండర్ బిల్లులు,డి ఏ ఎరియర్స్, పిఆర్సి ఎరియార్స్ బిల్లులు, జీ పి ఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్స్, మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులు, టిఎస్జీ ఎల్ ఐ ఫైనల్ పేమెంట్ బిల్స్ మెదలైనవి పెండింగ్ లో ఉన్న బిల్లులు రాక సిబ్బంది ఆందోళన చెందుతున్నారని కమీషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సీపీ సంబందిత అధికారులతో మాట్లాడి అతి త్వరలో క్లియర్ చేపిస్తానని హామీ ఇచ్చారు. కమీషనర్ ని కలిసిన వారిలో రాచకొండ కో ఆపరేటివ్ సొసైటీ ట్రేజరర్ కే బాల్ రాజ్, డైరెక్టర్స్ డి జంగయ్య, సంగి వలరాజు, తదితరులు ఉన్నారు.



# రాజపేటలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



రాజపేట, ఫిబ్రవరి 17(తీన్మార్ న్యూస్): రాజపేట మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాహాత్మ గాంధీ కూడలి వద్ద మండల పార్టీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆస్పత్రులలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, మండల పార్టీ సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, ఉపాధ్యక్షులు ములుగు సోమలింగం, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాకల ఉపేందర్, రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సట్టు తిరుమలేష, మాజీ ఉపసర్పంచి కూతురు లింగం, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఎర్ర గోకుల జశ్వంత్, మేక వెంకటేశ్వర్ రెడ్డి, యువజన విభాగమ అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్, ఖడ్గం స్వామి, గుర్రం నరసింహులు, రాజపేట పట్టణ శాఖ అధ్యక్షులు బెడిదే వీరేశం, ఎర్ర గోకుల రాజు, బిల్ల కుదురు రాజు, కోయ బాలరాజు, కర్రె కనకయ్య, గొల్లపల్లి సాయి, ఎర్రోళ్ల కరణ్, గుర్రం బాబు, రాములు నాయక్, దేవల నాయక్, లక్ష్మణ్ నాయక్, మాడావత్ లక్ష్మణ్, కర్రె కనకయ్య, ఠాకూర్ ధర్మేందర్ సింగ్, చెప్యాల మహిపాల్, సంఘీ ఉపేందర్, పంబ కరుణాకర్, కొండం రాజు, రాగిరి కుమార్ గౌడ్, వరిమడ్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకుంటూ నినాదాలు చేశారు.



# ప్రభుత్వ విప్పు బీర్ల సహకారంతో సీసీ రోడ్లు ప్రారంభం

రాజాపేట, ఫిబ్రవరి 17(తీన్మార్ న్యూస్): రాజపేట మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ప్రత్యేక సహకారంతో ఎమ్మెన్నార్ జీఎస్ మహాత్మా గాంధీ రూరల్ డెవలప్మెంట్ గ్యారంటీ స్కీం పథకం కింద రాజపేటకు సిసి రోడ్లు 65 లక్షలు మంజూరు కాగా శనివారం పనులు ప్రారంభించారు. కోతాటి లక్ష్మి ఇంటి నుండి శివాలయం గుడి వరకు పనిని ప్రారంభించారు. ఎంపీపీగొప్పగాని బాలమణి యాదగిరి గౌడ్, ఎండిఓ కూతల నాగవేణి, ఎంపిటిసి దాచేపల్లి రాజు, మాజీ సర్పంచులు పంచాయతి రాజ్ ఏఈ పూర్ణచంద్రావు, గ్రామ సెక్రెటరీ రేకులపల్లి భాస్కర్ రెడ్డి,రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, మాజీ వార్డ్ మెంబర్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అఖిలపక్ష నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పర్యటనను విజయవంతం చేయండి

**- కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 (తీన్మార్ న్యూస్): నేడు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, యాచారం మండలం, తక్కళ్లపల్లి తండా గ్రామపంచాయతీ పరిధి లో జరిగే ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ కోరారు. ఉదయం 11గంటలకు తక్కళ్లపల్లి తండా గ్రామపంచాయతీ లోని యాచారం సమీపాన ఉన్న సేయింట్ గ్రిగోరియస్ బాలాగ్రామ్ లొ జరిగే వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగ ప్రియతమ నేత ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి వస్తున్నారని అన్నారు. ఈ యొక్క కార్యక్రమం లో నియోజకవర్గం లోని రాష్ట్ర, జిల్లా, బ్లాక్ మండల మున్సిపల్, గ్రామాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు హాజరు కావాలని కోరారు.



# ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా రాములు



భువనగిరి టౌన్, ఫిబ్రవరి 17(తీన్మార్ న్యూస్): భువనగిరి పట్టణానికి చెందిన శెట్టి రాములు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జిల్లా అధ్యక్షునిగా శనివారం రోజున రాష్ట్ర కార్యాలయం లో నియమక పత్రాన్ని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఎస్సీ ఎస్టీ రాష్ట్ర అధ్యక్షులు పోకల సాయికుమార్ కి అందజేశారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సభ్యులు వేంకటేష్, శ్రీకాంత్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా మట్టి మొరం తరలిస్తే శాఖ పరమైన చర్యలు




**- తహశీల్దార్ కృష్ణ**

టేక్మాల్, ఫిబ్రవరి 17(తీన్మార్ న్యూస్): అనుమతులు లేకుండా మట్టి మొరం తరలిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని శాఖపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ క్రిష్ణ ఒక ప్రకటన లో తెలిపారు. మట్టి మొరం కలనుకున్న వ్యక్తి పట్టేదార్ పసుబుక్ సర్వే నంబర్ తో ఆన్లైన్ లో www.mines.telangana.com లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.లేని ఎడల ఎవరైనా పరిమిషన్ లేకుండా తరలిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

# ఖని ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతి



గోదావరిఖని:గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం కోసం వచ్చిన మహిళ కడుపులో శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతిచెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళ బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని బాపూజీనగర్‌కు చెందిన గర్భిణి రజితకు నెలలు నిండటంతో ప్రసవం కోసం ఆమెకుటుంబీకులు ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. నెలలు నిండాయని.. శస్త్రచికిత్స ద్వారా ప్రసవం చేయాలని కోరినా వైద్యులు కాలయాపన చేశారని ఆరోపించారు. గురువారం ఉదయం పరిస్థితి విషమించింది గర్భంలోనే బిడ్డ చనిపోయిందని వైద్యులు తెలిపారన్నారు. సాయంత్రం శస్త్రచికిత్స చేసి మృతి చెందిన శిశువును తమకు అప్పగించినట్లు చెప్పారు.కేవలం వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందిందని ఆరోపించారు. రజిత భర్త పప్పుల గురుప్రసాద్‌తో పాటు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. కాగా మహిళకు ప్రసవానికి సంబంధించిన ఎలాంటి నొప్పులు రాలేదని ఖని ప్రభుత్వ ఆస్పత్రి స్త్రీవైద్య నిపుణురాలు అరుణ తెలిపారు. ఆమె ప్రసవానికి ఇంకా సమయం ఉండగా తెల్లవారు జామున పరిస్థితి ఒక్కసారిగా మారిందన్నారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పామన్నారు.

# కర్షకులకు పంట నష్ట పరిహారం అందించాలి: సీపీఎం

కొత్తగూడెం:మిగ్‌జాం తుపాను వల్ల పంట దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ కోరారు. మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన కొత్తగూడెం మంచికంటిభవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకేసారి భారీ వర్షాలు కురవడంతో జిల్లాలో చేతికొచ్చిన వేల ఎకరాల్లోని పంటలు దెబ్బతిన్నాయన్నారు. అధికారిక లెక్కల ప్రకారమే సుమారు 13 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. కానీ అంతకన్నా ఎక్కువగానే నష్టం జరిగిందని పోతినేని అన్నారు. బాధిత రైతులను వెంటనే ఆదుకోవాలన్నారు.

# రఘునాథ పురం లో మాజీ ముఖ్య మంత్రి జన్మదిన వేడుకలు



రాజాపేట, ఫిబ్రవరి 17(తీన్మార్ న్యూస్): తెలంగాణ జాతిపిత ఉద్యమకారులు భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 70వ, పుట్టినరోజును పురస్కరించుకొని శనివారం రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో గ్రామశాఖ అధ్యక్షుడు కొండం రాజు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు పారిశుద్ధ కార్మికులకు పండ్ల పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల టిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు పల్లె సంతోష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం చావు నోట్లో తలకాయ పెట్టి అప్పటి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ సాధించిన ఘనత కెసిఆర్ దేననన్నారు. రాష్ట్రానికి దశాబ్ద కాలం పాటు ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి కేసీఆర్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచారని జాతి ఎన్నడూ కూడా మరిచిపోదని 100 సంవత్సరాల పాటు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నరన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం సిద్ధిరాములు రామిండ్ల నరేందర్, మాజీ ఉపసర్పంచ్ పల్లె ప్రవీణ్ గౌడ్, పాల సంఘం చైర్మన్ బత్తిని పరుశురాములు గౌడ్, సీనియర్ నాయకులు కటకం వెంకటేష్, కానుగంటి శ్రీనివాస్ రెడ్డి, నల్ల అశోక్, భోగ రాజు, కలకుంట్ల పోచయ్య, చెన్న నర్సింగరావు, కటకం చిన్న వెంకటేశం, కటకం నాగభూషణం, కుందనపల్లి నరసింహులు, యువజన నాయకులు కటకం స్వామి, బత్యం సిద్ధిరాములు, కలకుంట్ల కర్ణాకర్, డొంకెన మహేందర్, పులి నవీన్, ఎర్ర శ్రీశైలం, తుంగ అక్షయ్, నీల మహేందర్, మిట్ట కార్తీక్ గౌడ్, బొట్టు భాను, కటకం పృధ్వీ రాజు, తండ వెంకటేష్ గౌడ్, తండ సిద్దులు, కలకుంట్ల భాను, కర్రె కిషన్, గొర్రెంకల ఉపేందర్, సాయి, సంగిశెట్టి అనిల్, రాచమల్ల మల్లికార్జున్, తుంగ స్వామి, ఎండి అఫ్రోజ్, బొట్టు శ్రీకాంత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న మేడారం జాతర నిర్వహణపై విచారణ

**– టెండర్లు అన్నీ రద్దు చేయాలని అడిషనల్ కలెక్టర్ కు నివేదిక**

**– కనీస వసతులు లేవంటూ అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు**





రాజాపేట, ఫిబ్రవరి 17(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం, చిన్న మేడారం సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణపై శనివారం అధికారులు విచారణ జరిపారు. పత్రికలలో వచ్చిన వార్తలకు అడిషనల్ కలెక్టర్ స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికను వెంటనే సమర్పించాలని రాజపేట మండల ఎంపిఓ దినకర్ కు ఆదేశాలు జారీ చేయడంతో, జాతర గద్దెల వద్ద కమిటీ సభ్యులతో విచారణ జరిపారు. పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు. దాదాపు అన్ని విభాగాలలో టెండర్లు వేయడంతోపాటు, మద్యం విక్రయం, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు టికెట్టు కొనాలని నిబంధన కూడా విచారణలో తేలింది. జాతరలో కనీస వసతులు లేకపోవడం, కేవలం లాభాలు ధనార్జన కోసమే 11 కుటుంబాల ట్రస్టు సభ్యులు జాతరను కొనసాగించడం చేస్తున్నట్లు విచారణలో తెలుసుకోవడంతో సదురు ఎంపీవో కూడా అసహనం వ్యక్తం చేశారు. చిన్న మేడారం జాతరను దేవాదాయ శాఖ పరిధిలో కలపాలని నిర్వాహకులు ఎంపీఓ కు తెలిపారు. పూర్తిస్థాయి టెండర్లు రద్దు చేయాలనీ, కనీస వసతులు కూడా జాతరలో లేవని అడిషనల్ కలెక్టర్ కు పంపే నివేదికలో పేర్కొననున్నట్లు ఎంపీవో చెప్పారు. సామాన్య పేద భక్తులకు ఆర్థిక భారం మోపకుండా జాతర ఉండాలంటూ భక్తులు తెలిపారు.

# తపాలా ఉద్యోగుల సమ్మె బాట




ఆలేరు,:గ్రామీణ తపాలా ఉద్యోగులు (జీడీఎస్) తమ సమస్యల సాధనకు సమ్మె బాట పట్టారు. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తపాలా బట్వాడా సేవలు నిలిచాయి. సమ్మె విషయమై గతంలోనే సంబంధిత ఉన్నతాధికారులకు పలు పర్యాయాలు పత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. గతంలోనూ ప్రభుత్వ పరంగా ఇచ్చిన కొన్ని హామీల్లోనూ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోక పోవడంతో తిరిగి సమ్మెకు పూనుకున్నారు. ముఖ్యంగా ఈసారి కమలేశ్ చందర్ కమిటీ సిఫారసు అంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తదితర డిమాండ్లతో తపాలా ఉద్యోగులు సమ్మెకు దిగారు. ఆల్ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ ఐకాస కమిటీగా ఏర్పడి నిరవధిక సమ్మెకు దిగాయి. జీడీఎస్ల ద్వారా దేశవ్యాప్తంగా తపాలాశాఖకు 80 శాతం పైగా లాభాలను ఆర్జించి పెడుతున్నప్పటికీ తమ సమస్యల పరిష్కారంలో, ఇచ్చిన హామీల అమలులో వివక్ష చూపుతోందని జీడీఎస్ ఉద్యోగులంటున్నారు. కాగా జీడీఎస్లు చేపడుతున్న సమ్మెతో ఉపాధిహామీ కూలీల చెల్లింపులు, ఉత్తరాల బట్వాడా, డిపాజిట్లు, విత్డ్రాలు, సుకన్య సమృద్ధియోజన లాంటి సేవలకు అంతరాయం ఏర్పడనుంది. ఉద్యోగులకు ప్రభుత్వపరంగా ఆరోగ్య సదుపాయం లేదు. 65 సంవత్సరాల వయసులో ఉద్యోగ విరమణ అనంతరం శాఖపరంగా ఎలాంటి పింఛన్ సదుపాయం ఉండదు. సెలవులు లేకపోగా (మహిళా ఉద్యోగులకు మినహా), అత్యవసర పనులకు వెళ్లాల్సివస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని వెళ్లాల్సిందే. ఒక్కో బీపీఎం రూ.లక్షల్లో ఆసరా, ఉపాధికూలీ చెల్లింపులు, ఇతర డిపాజిట్ల రూపేనా స్వంత రక్షణ చేపట్టుకోవాల్సిందే. దురదృష్టవశాత్తు అనుకోని విపత్తు జరిగినా సదరు ఉద్యోగే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ నియామక ప్రక్రియ చేపడుతున్నప్పటికీ, ఉద్యోగభద్రత, వేతనం ఇతర సదుపాయాలు ఆ స్థాయిలో ఉండటంలేదు.

# అధ్వానంగా మరుగుదొడ్ల నిర్వహణ



మిర్యాలగూడ :విద్యా సంవత్సరం ప్రారంభంలో విస్తృత ప్రచారం చేసే అధికారులు.. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో మాత్రం దారుణంగా విఫలమవుతున్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల సమస్య తీవ్రత కారణంగా అనేక మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటేనే ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బాలికలు.. వీరిలోనూ కౌమార దశలోని బాలికలైన ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థినుల ఇబ్బందులు అనేకం. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు గతంలో ప్రత్యేకంగా స్కావెంజర్లు ఉండేవారు. నూతన పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ్య పనులు స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, పురపాలికలు చేపట్టాలనే నిబంధన విధించారు. ఈ సంస్థలు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో పాఠశాలల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్వహణ లేక భరించలేని దుర్వాసనకు తోడు శిథిలావస్థకు చేరుకున్నాయి. నల్గొండ జిల్లాలో పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోగా.. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోని పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ స్కావెంజర్లు లేక అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. మరోవైపు అపరిశుభ్ర టాయిలెట్లు ఉపయోగించడంతో అనేక రోగాల బారిన పడాల్సి వస్తుందని.. ముఖ్యంగా బాలికలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. పలు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి తమ సొంత ఖర్చుతో ప్రత్యేకంగా స్కావెంజర్లను నియమించుకుని మరుగుదొడ్లు నిర్వహించుకుంటున్నారు. మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. మిర్యాలగూడలోని గాంధీ పార్కు పాఠశాలలో పాత మరుగుదొడ్లు కూల్చివేయగా.. కొత్త వాటి నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ఉపాధ్యాయుల కోసం ఉన్న రెండు మూత్రశాలలను సుమారు 300 మంది బాలికలు సైతం ఉపయోగిస్తుండడంతో లైన్లలో నిలబడాల్సి వస్తుంది.

# మహాలక్ష్మి పథకం.. మహిళలకు వరం: కలెక్టర్

ఖమ్మం :రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిదని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. ఖమ్మం నగరంలోని టీటీడీసీలో మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను కేంద్ర బిందువుగా చేసుకొని మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా సమాజంలో, ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో స్వయం సహాయక సంఘాల పాత్ర కీలకమని అభిప్రాయపడ్డారు. వయసు, ఆర్థిక తేడాలు లేకుండా మహిళలంతా ఉచితంగా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ బస్సుల్లో ప్రయాణం చేయవచ్చునని చెప్పారు. చేయూత కింద ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వివరించారు. జిల్లాలోని టీహబ్లో 115 రకాల పరీక్షలు చేపడుతున్నారన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో నమూనాలు సేకరించి టీహబ్కు పంపుతారని, పరీక్షల రిపోర్టులు ఎస్ఎంఎస్ రూపంలో వస్తాయని చెప్పారు. డీఆర్డీఓ ఎం.విద్యా చందన, ఆర్టీసీ ఆర్ఎం సీహెచ్ వెంకన్న, జిల్లా సంక్షేమ అధికారి సుమ, డీఎంహెచ్ఓ బి.మాలతి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# అవసరం తీరాక.. అరకొర పనులు

## చెరువును తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం



నిడదవోలు: జగన్ వస్తున్నారని బహిరంగ సభ నిర్వహణకు అనువుగా యుద్ధ ప్రాతిపదికన ఓ ఆట స్థలాన్ని సిద్ధం చేశారు. దాన్ని అలా వదిలేస్తే బాగానే ఉండేది. కానీ సమతలం చేసేందుకు అక్కడి షట్రును తొలగించి జగనన్న కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి తరలించాలని అధికారులు ప్రతిపాదించారు. అందుకు నిధులు మంజూరు చేసి సగం వరకు తొలగింపు పనులు చేపట్టారు. కొంత తొలగించి మిగిలిన ప్రాంతాన్ని అలా వదిలేశారు. ఇప్పుడా ప్రాంతంలో నీరు చేరి చెరువును తలపిస్తోంది. కాపునేస్తం లబ్ధిదారుల ఖాతాలకు నిధులు విడుదల చేసేందుకు ఈ ఏడాది సెప్టెంబరు 16న జగన్ నిడదవోలు వచ్చిన విషయం విదితమే. అప్పుడు అధికారులు బహిరంగసభకు స్థానిక సెయింట్ ఆంబ్రోస్ పాఠశాల ఆటస్థల ఆవరణను ఎంపిక చేశారు. అదే సమయంలో వర్షాలు పడటంతో పొడిగా ఉండేందుకు అక్కడ క్వారీ వ్యర్థాల(రబ్బీస్)తో పరిచారు. వాహనశ్రేణి వెళ్లేందుకు వీలుగా క్వారీ రబ్బీస్ సహా వెట్మిక్స్తో రహదారి నిర్మించారు. అనంతరం అక్కడ అదంతా తొలగించి పట్టణంలోని తీరుగూడెం, వైఎస్సార్నగర్ జగనన్న కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి తరలించి, చదును చేయాలని అధికారులు ప్రతిపాదించారు. అదే నెల 30న జరిగిన పురపాలక సంఘ సాధారణ సమావేశంలో రూ.5 లక్షలు ఇందుకు కేటాయిస్తూ తీర్మానం చేశారు. సెయింట్ ఆంబ్రోస్ పాఠశాల నుంచి జగనన్న కాలనీలకు తరలించేందుకు ఎగుమతి, దిగుమతులు, రవాణా, ఇంధనం, డ్రైవర్ ఛార్జీలతో కలిపి రూ.4.25 లక్షలు, కాలనీల్లో జేసీబీతో చదును చేయడానికి రూ.45వేలు, దిగుమతి చేసిన షట్రు, వ్యర్థాలను దొర్లించేందుకు రూ.30 వేలు మంజూరు చేశారు. అనంతరం ఆటస్థలం నుంచి తరలింపు పనులు కొంతమేర చేశారు. ఆ పనులు ప్రస్తుతం నిలిపివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు షట్రు తొలగించిన ప్రాంతంలో నీరు చేరి చెరువును తలపిస్తోంది. ఈ సమస్యను మున్సినల్ కమిషనర్ కేవీ పద్మావతి దృష్టికి 'న్యూస్టుడే' తీసుకెళ్లగా పనులు ప్రారంభించామని, జేసీబీ మరో పనికి వెళ్లడం వల్ల ప్రస్తుతం ఆగాయని, తొలగింపు పనులను తక్షణమే చేపడతామని వివరణ ఇచ్చారు.

# నలుచెరగులా నిరసన స్వరం



రాజమహేంద్రవరం: 'సమస్యలపై ప్రభుత్వానికి చెప్పి చెప్పి విసిగిపోయాం. ఇక ఆందోళన బాట తప్ప మరో మార్గం లేద'ంటూ వివిధ పక్షాలు నిరసనలు చేపడుతున్నాయి. తమ న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలని గళమెత్తుతున్నారు. పోలీసులు ఆంక్షలు విధిస్తున్నా వెరవకుండా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా అంతటా అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సమగ్ర శిక్షా సిబ్బంది నిరసన తెలియజేస్తుండగా ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులు, అగ్రిగోల్డ్ బాధితులు కూడా ఆందోళనలు చేపట్టారు. ధర్నాలు నిర్వహించి కలెక్టరేట్ల వద్ద హోరెత్తించారు. 20 నుంచి సమ్మెకు వెళ్లే యోచనలో సమగ్ర శిక్షా సిబ్బంది ఉన్నారు. మరో వైపు ప్రభుత్వం తెచ్చిన కొత్త భూహక్కు చట్టాన్ని న్యాయవాదులు తప్పుబట్టారు. అంగన్వాడీ సిబ్బంది సమ్మె ఉద్ధృత రూపం దాలుస్తోంది. రాజమహేంద్రవరంలో సుమారు 1000 మంది సిబ్బంది హైటెక్బస్టాండ్ వద్ద నుంచి ప్రదర్శన ప్రారంభించి కంబాలచెరువు, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, నగరపాలక సంస్థ కార్యాలయం మీదుగా సబ్కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించారు. సంఘ ప్రతినిధులు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కనీస వేతనం చెల్లించమంటే వైకాపా సర్కారు పట్టించుకోవడంలేదన్నారు. నీ కాకినాడ ఆర్డీవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున అంగన్వాడీ సిబ్బంది చేరుకుని నినదించారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఆందోళనకు సంఘీభావం తెలిపారు. కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంతో పాటు వివిధ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. పి.గన్నవరంలో ర్యాలీ చేసి కంచాలపై గరిటెలతో మోతమోగించారు. జిల్లా వ్యాప్తంగా 3,363 మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో ఉన్నారు. ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో కేంద్రాలు తెరిపించినా లబ్ధిదారులు మాత్రం హాజరుకాలేదు. తమ పిల్లలను పంపించేందుకు అంగీకరించలేదు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం కలెక్టరేట్ వద్దకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్షేత్రసహాయకులు వందల సంఖ్యలో చేరుకుని నిరసన తెలిపారు. అమలాపురంలో నల్లవంతెన నుంచి ర్యాలీ చేపట్టారు. స్పందనలో వినతిపత్రం అందజేశారు. 380 మంది పాల్గొన్నారు.


## సరకుల పంపిణీలోనూ కోత

# ధరల పెరుతగుదలతో మరింత భారం



రాజమహేంద్రవరం: నోరు తీపి చేసుకుందామనుకుంటే ధరల మంటతో మింగుడు పడడం లేదు. పిల్లలకు పిండి వంటలు తినిపించేందుకు నిత్యావసరాల ధరలు అందుబాటులో లేవు. సర్కారు రేషన్లో ఇచ్చే సరకులు సక్రమంగా అందటం లేదు. కరవుకు తోడు తుపాను దెబ్బకి వ్యవసాయాధారిత పనులు లేక సామాన్యులను ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. వీరికి ఊరటనిచ్చేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో పండగలు భారమవుతున్నాయి. ప్రధాన పండగలకు ప్రత్యేక కోటాలో నిత్యావసరాల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం నాలుగేళ్లుగా స్వస్తి పలికింది. ప్రతి నెలా పంపిణీ చేసే సాధారణ రేషన్ సరకుల్లోనే కోత విధిస్తుండడంతో నిరుపేదలు అసంతృప్తిగా ఉంటున్నారు. క్రిస్మస్, సంక్రాతి తదితర పండగలకు గత తెదేపా సర్కారు చంద్రన్న కానుకలను అందించింది. ఆరు రకాల సరకుల కిట్టు ఉచితంగా పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. అందులో గోధుమ పిండి కిలో, కంది పప్పు అరకిలో, శెనగ పప్పు అరకిలో, బెల్లం అరకిలో, వంట నూనె అర లీటరు, నెయ్యి 100 గ్రాములు వంతున ఉన్నాయి. ఇప్పుడు అటువంటి ఊసే లేదు. ఏటా పండగలకు పేదలు ప్రభుత్వం వైపు ఆశగా ఎదురు చూస్తున్నా నిరాశే ఎదురవుతోంది. కరవుతో పనులు లభించక పేదల ఆదాయం తగ్గిపోయింది. మిగ్జాం తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిని రైతులు ఆర్థిక నష్టాల్లో మునిగారు. దీనికి తోడు నిత్యావసరాల ధరలు బహిరంగ మార్కెట్లో విపరీతంగా పెరిగాయి. రెక్కలు తొడిగిన ధరలను తట్టుకునేలా తమ సంపాదనకు పొంతన లేదని కూలీలు వాపోతున్నారు. అప్పు చేసి పండగ చేసుకోవాలంటే భారమవుతోందని ఆవేదన చెందుతున్నారు. శనగ నూనె లీటరు రూ.165, కంది పప్పు కిలో రూ.160, శెనగ పప్పు కిలో రూ. 80, బెల్లం కిలో రూ.55, పంచదార కిలో రూ.45, గోధుమ పిండి కిలో రూ.60 వంతున ధర పలుకుతోంది. పెరిగిన ధరలతో పిండి వంటలు కూడా చేయలేకపోతున్నామని మహిళలు వాపోతున్నారు. కనీసం పండగల సమయంలోనైన ప్రభుత్వం ప్రత్యేక కోటా ఇస్తే కొంత ఊరట ఉంటుందని ఆశిస్తున్నారు. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే నిత్యావసర సరకుల్లోనూ కోత విధిస్తోంది. బియ్యం మినహా మిగతావి సక్రమంగా పంపిణీ చేయడం లేదు. అరకిలో కంది పప్పు రూ.67, అరకిలో పంచదార రూ.17, గోధుమ పిండి కిలో రూ.15 వంతున అప్పుడప్పుడు మాత్రమే ఇస్తున్నారు. ఒక్కోసారి బియ్యంతోనే సరిపెడుతున్నారు. మిగతా సరకులు ఎప్పుడు వస్తాయో లేదోనన్న విషయం కూడా తెలియడం లేదని, డీలర్లు ఇచ్చిన సరకులు పంపిణీ చేయడమే తమపని అని ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు చెబుతున్నారు. జిల్లాకు కేటాయించిన నిత్యావసరాలను పరిశీలిస్తే ఈ నెలలో 400 మెట్రిక్ టన్నుల కంది పప్పు, 150 మెట్రిక్ టన్నుల గోధుమ పిండి, 75 మెట్రిక్ టన్నుల పంచదార కొరత ఏర్పడింది. గిడ్డంగులు, డీలర్ల వద్ద ఉన్న అరకొర నిల్వలను కార్డుదారులకు సర్దుబాటు చేశారు. మారుమూల ప్రాంతాల్లో బియ్యం ఒక్కటే ఇచ్చారు.

# ఆందోళనలతో దద్దరిల్లిన కలెక్టరేట్



కర్నూలు :తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని.. ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని అంగన్వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. నగరంలోని ఎస్టీబీసీ కళాశాల నుంచి కర్నూలు నగరపాలక కార్యాలయం వరకు సోమవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం నగరపాలక కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల, అంగన్వాడీ సంఘం రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ తదితరులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహ రిస్తోందని.. అంగన్వాడీలపై బెదిరింపు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం సైతం అంగన్వాడీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాలను సచివాలయాలకు అప్పగించకూడదని డిమాండ్ చేశారు. నాయకులు నరసింహులు, మహమ్మద్ రఫీ, సుధాకరప్ప, బాల దుర్గమ్మ, రుక్మిణీ, సునంద, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు. తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఈశ్వరీబాయి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. పని ఒత్తిడి కారణంగా అనారోగ్యానికి గురవుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకురాళు శాంతకుమారి, దస్తగిరమ్మ, నాగార్జునమ్మ, సుబేదా, అనిత, రమీజాబీ, కాంతమ్మ, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.


# మేడారం జాతరకు ప్రత్యేక రైళ్లు ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!



ములుగు: తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. జాతర సందర్భంగా ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ప్రత్యేక రైళ్లు భక్తుల సౌకర్యార్థం నడుస్తాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.
సికింద్రాబాద్-వరంగల్, నిజామాబాద్-వరంగల్, సిర్పూర్ కాగజ్‌నగర్-వరంగల్ మార్గంలో నడుస్తాయని తెలిపారు. బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, భువనగిరి, జనగాం, ఘన్‌పూర్, కామారెడ్డి, మనోహరాబాద్, మేడ్చల్, ఆలేరు ప్రాంతాలకు చెందిన వారికి ఉపయోగపడనున్నాయి. సిర్పూర్ కాగజ్‌నగర్-వరంగల్-సిర్పూర్ కాగజ్‌నగర్ (07017/07018), సికింద్రాబాద్-వరంగల్-సికింద్రాబాద్ మధ్య (07014/07015) నిజామాబాద్-వరంగల్-నిజామాబాద్ (7019/07020) రైళ్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రభుత్వం, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజన సంక్షేమం విషయంలో చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే జాతరకు ప్రత్యేక రైళ్లు వేయడంతోపాటుగా జాతర ఏర్పాట్ల కోసం రూ. 3కోట్లను కేటాయించిందని వివరించారు.

# ఆధార్ ఉంటేనే గృహజ్యోతి.. విద్యుత్తు కనెక్షన్ నంబర్‌కు ఆధార్‌తో అనుసంధానం

**- లేనివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి**
**- మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వం**



హైదరాబాద్, ఫిబ్రవరి 17: ఆధార్ కార్డు ఉన్నవారికే గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఇంధన శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. విద్యుత్తు కనెక్షన్ నంబర్‌ను, లబ్ధిదారుల ఆధార్‌తో అనుసంధానం చేయనున్నట్టు తెలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులను నియమిస్తామని చెప్పింది. ఆధార్ లేకపోతే వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించింది. అథెంటిఫికేషన్ చేసే సమయంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నంబర్ చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నది.
శాశ్వత ఆధార్ నంబర్ వచ్చే వరకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నంబర్‌తోపాటు ఫొటో ఉన్న బ్యాంక్ పాస్‌బుక్, పాన్, పాస్‌పోర్ట్, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ, ఉపాధి హామీ పథకం కార్డు, కిసాన్ పాస్‌బుక్, డ్రైవింగ్‌లైసెన్స్ లేదా గెజిటెడ్ అధికారి సంతకం చేసిన ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నది. అథెంటిఫికేషన్ సమయంలో వేలిముద్రలు తీసుకుంటారని, బయోమెట్రిక్ పనిచేయకపోతే ఐరిస్ ద్వారా ప్రయత్నిస్తారని తెలిపింది. అదికూడా పనిచేయని పక్షంలో ఓటీపీ ద్వారా అథెంటిఫికేషన్ చేస్తారని, అదీ కాకపోతే ఆధార్ ధ్రువీకరణ పత్రం తీసుకుంటారని వివరించింది.

# 10 నెలల పెండింగ్ ఉపకార వేతనాలు చెల్లించాలి

**- టి వి వి పి పీజీ వైద్యులు డిమాండ్..**




సుల్తాన్ బజార్ : గత పది నెలలుగా ఉపకార వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని టి వి వి పిజి వైద్య విద్యార్థులు టి వి వి పి కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం కొఠి డిఎం ఈ ఆవరణ లోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ను వారు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2020లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పక్షాన డిప్లొమాటిక్ నేషనల్ బోర్డు ఆధ్వర్యంలో 46 మంది నీ సంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకు పీజీ వైద్య విద్యార్థులను ఎంపిక చేశారు అన్నారు. 2023 వరకు ఉపకార వేతనాలు అందించినప్పటికీ, గత ఏడాది ఏప్రిల్ నుంచి సుమారు 10 నెలలుగా ఉపకార వేతనాలు అందజేయడం లేదని వారు ఆరోపించారు స ఈ విషయమై తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ ను , వైద్య ఆరోగ్యశాఖ ఉన్నత అధికారులను పలుమార్లు విన్నవించిన తమ సమస్యను పట్టించుకున్న నాధుడే కరువయ్యాడని అన్నారు. గత నెల క్రితం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా పది రోజులలో మీ సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారన్నారు. మంత్రి హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ తమ సమస్య పరిష్కా పరిష్కారం కాకపోవడంతో పాటు ఉపకార వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం డిఎన్ బీలో ఉన్న 46 మంది పీజీ వైద్య విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయాలని టి వి వి పి కమిషనర్ అజయ్ కుమార్ కు వినతి పత్రం అందజేసి జీతాలు ఇవ్వాలని కోరారు.

# మందుల టెండర్‌కు రూ.3 లక్షల లంచం



నల్లగొండ కలెక్టరేట్: నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు నాయక్ శుక్ర వారం తన నివాసంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఔషధాల టెండర్‌కు అనుమతి ఇచ్చేం దుకు కాంట్రాక్టర్ లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఎం.వి శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన కాంట్రాక్టర్ రాపోలు వెంకన్న రెండు సంవత్సరాలుగా సర్జికల్, డ్రగ్స్ సప్లై చేస్తున్నారు. అయితే నాన్ టెండర్ డ్రగ్స్‌ను కూడా సప్లై చేయాలని గతంలోనే సూపరింటెండెంట్ కాంట్రాక్టర్‌కు ఆర్డర్ ఇచ్చారు. అయితే దానికి గడువు ఇంకా ఐదు నెలలు ఉండగానే ప్రతి దానిలో 10 శాతం వాటా కావాలంటూ సూపరింటెండెంట్ లచ్చు నాయక్ డిమాండ్ చేశారు. అందులో భాగంగానే కాంట్రాక్టర్ 45 రోజుల కిందట లక్ష రూపాయలు, 12 రోజుల కిందట మరొక లక్ష రూపాయలు ఇచ్చాడు.
కాగా మూడ్రోజుల కిందట కాంట్రాక్టర్‌తో మాట్లాడిన సూపరింటెండెంట్ మళ్లీ రూ. 3 లక్షలు డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే టెండర్ కాల్ ఫర్ చేస్తానని చెప్పడంతో కాంట్రాక్టర్ రాపోలు వెంకన్న ఏసీబీని ఆశ్రయించాడు. 9తేదీనే ఏసీబీకి ఫిర్యాదు అందింది. అప్పటి నుంచి అధికారులు వివరాలు సేకరించారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో కాంట్రాక్టర్ సూపరింటెండెంట్ ఇంటికి వెళ్లి డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డబ్బులను రికవరీ చేశారు. సూపరింటెండెంట్ లచ్చు నాయక్ ఇంట్లో సోదాలు నిర్వహించారు.
అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్లోనూ తనిఖీ చేశారు. టెండర్ ప్రాసెస్, నాన్ టెండర్ ప్రాసెస్ రికార్డులతో పాటు మరికొన్ని రికార్డులను పరిశీలించారు. విచారణ పూర్తయిన అనంతరం కోర్టులో హాజరు పరచనున్నారు. నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా 2021 డిసెంబర్ 30న లచ్చు నాయక్ బాధ్యతలు స్వీకరించారు.

# బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు.. 10 మంది మృతి



చెన్నై: తమిళనాడు విరుదునగర్ జిల్లా శివకాశిలోని ఓ బాణసంచా పరిశ్రమలో శనివారం భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుడు కారణంగా పరిశ్రమలో పనిచేస్తున్న 10 మంది కార్మికులు మృతి చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. పరిశ్రమలో మొత్తం 200 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం.
గాయపడ్డవారిని శివకాశీలోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పేలుడు ధాటికి బాణసంచా పరిశ్రమ పక్కనే ఉన్న రెండు భవనాలు నేలమట్టమయ్యాయి. పేలుడు సమయంలో పరిశ్రమలో చిక్కుకున్నవారిని బయటికి తీసుకురావడానికి, మంటలార్పడానికి అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టారు.
నిబంధనలకు విరుద్ధంగా మితిమీరిన రసాయన ముడి పదార్థాలను నిల్వ చేయడం వల్లే పేలుడు జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంపై పూర్తి నివేదిక సమర్పించాలని కలెక్టర్ జయశీలన్ ఆదేశించారు.

# ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా మేడారం

**పంచాయతీ రాజ్, స్త్రీ-శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క**




ములుగు: మేడారంను ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించాని పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులకు సూచించారు. గురువారం మలుగు జిల్లా మేడారంలోని హరిత హౌటల్ సమావేశం మందిరంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ శిక్షణ కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జాతర సమయం దగ్గర పడుతున్న తరుణంలో సందర్శకుల తాకిడి పెరుగుతోందన్నారు. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు చూడాలన్నారు. నిరంతరం తాగు నీరు అందించాలని చెప్పారు.
జాతర ముగిసిన అనంతరం కూడా ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మాట్లాడుతూ.. జాతరలో గద్దెల ప్రాంగణంలో బెల్లం, కొబ్బరికాయలు శుభ్రం చేయాలని, జంపన్న వాగు సమీపంలో తలనీలాలు కూడా శుభ్రం చేయాలని అన్నారు. మిషనరీ యంత్రాల ద్వారా పారిశుధ్య సిబ్బంది నిరంతరం విధులు నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ త్రిపాఠి మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి జాతర విధులుకు వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా 19 తేదీన సంబంధిత జోనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలని చెప్పారు. జాతరలో పారిశుధ్య పనులు చేయడం కోసం 10 సెక్టార్లు, 60 సబ్ సెక్టార్స్‌గా విభజించామని, డీపీఓ, డీఎల్‌పీఓల ఆధ్వర్యంలో పనులు జరుగుతాయని అన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ.. అధికారులకు కేటాయించిన జోన్‌లలో విధులు నిర్వహించాలన్నారు. ప్రతి జోన్‌కు ఎంపీఓ స్థాయి అధికారిని కేటాయించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శబరిష్, డీపీఓలు, డీఎల్పీఓ, వివిధ జిల్లాల జోనల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలి

**- మృతుని కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**
**- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**
**- డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్**




మెదక్: పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ ఫ్యాక్టరీలలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.జయరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాశమైలారం పారిశ్రామికవాడలో సీఎంహెచ్ పరిశ్రమలో రియాక్టర్ పేలి సంభవించిన అగ్ని ప్రమాదంలో మృతిచెందిన శ్యాంబాబు కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.
సంగారెడ్డి జిల్లాలోని పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇలాంటి ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. గడ్డపోతారం, పాశమైలారం, జిన్నారం, ఖాజిపల్లి, హత్నూర ప్రాంతంలో రెగ్యులర్‌గా ప్రమాదాలు జరుగుతున్నా సంబంధించిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బొల్లారం అమర్ కెమికల్ పరిశ్రమ, పాశమైలారం మోనాక్షి లైఫ్ సైన్సెస్, టైర్ల పరిశ్రమ, జిన్నారం మండలంలో లీఫార్మాలో భారీ ప్రమాదం జరిగినా పట్టించుకోలేదన్నారు. ఫసల్వాది శివారులోని గణపతి ఫ్యాక్టరీలో కార్మికులు ప్రమాదానికి గురై మరణించారని గుర్తు చేశారు. బొర్పట్ల అరవిందోలో జరిగిన ప్రమాదంలో కార్మికుడు మరణిస్తే.. బయటికి పొక్కకుండా చేశారన్నారు. ప్రమాదాలపై స్పందించాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వీరిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా సరిగ్గా తనిఖీలు చేయడం లేదని విమర్శించారు. పరిశ్రమల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో సేఫ్టీ మెజర్‌మెంట్స్ విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. కార్మికుల కుటుంబాలను తక్షణమే ఆదుకునే విధంగా ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ పరమేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మల్లేశం, కె.రాజయ్య, జి.సాయిలు, నాయకులు నర్సింహులు, ఎం.యాదగిరి, బాగారెడ్డి, భూషణం, కృష్ణ పాల్గొన్నారు.

# గురుకులాలన్నీ ఒకే గొడుగు కిందకు

**- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లలు ఒకే చోట చదువుకునేలా ఏర్పాట్లు**
**- 20ఎకరాల్లో కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టు**
**- 70 రోజుల్లోనే 25వేల ఉద్యోగ నియామకాలు చేపట్టాం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**
**- ప్రభుత్వ గురుకులాల ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేత**

సిటీబ్యూరో: "రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదువుకునేందుకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. మరి వాటిల్లో కనీస మౌలిక వసతుల్లేక.. ఆడపిల్లలు అవస్థలు పడుతుంటే కంటికి కనిపించ లేదా. వందలాది ఆడబిడ్డలు టాయిలెట్లు లేక లైన్‌లో ఉండి వెళ్తున్న దుస్థితి కనిపించ లేదా. మన బిడ్డలో.. మన అక్కో.. చెల్లో అలా ఇబ్బంది పడితే చూస్తూ ఊరుకుంటామా. వారి కోసం వసతులు ఏర్పాటు చేయాలన్న బాధ్యత ప్రభుత్వాలపై లేదా.. లక్షల కోట్ల బడ్జెట్ కలిగిన మిగులు రాష్ట్రమైన తెలంగాణలో పదేండ్ల కాలంలో రూ. 15.5లక్షల కోట్లు కేసీఆర్ చేతికి వచ్చినా ఎందుకు ఆ పిల్లలకు వసతులు ఏర్పాటు చేయలేదు" అని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకే గురుకుల పాఠశాలలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొస్తామని చెప్పారు. 20ఎకరాల్లో ఒకే క్యాంపస్‌లో అన్ని రకాల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తామని, కొడంగల్‌లో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నామని చెప్పారు. "ఈ మోడల్‌ను అన్ని నియోజకవర్గాల్లో ఆచరణలోకి తీసుకొస్తాం. ఇందుకు కావాల్సిన స్థలాలను సేకరించాలని వేదికపై నుంచే అధికారులను ఆదేశిస్తున్నా' అని అన్నారు. కొత్తగా నియామకమైన ప్రభుత్వ గురుకులాల ఉపాధ్యాయులకు(పీజీటీలు, పీడీలు, లైబ్రేరియన్లు) నియామక పత్రాలను గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎస్ శాంతి కుమారితో కలిసి సీఎం అందజేశారు.
అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగ నియామకాల విషయంలో పదేండ్లు బీఆర్ఎస్ నిర్లక్ష్యం వహించిందన్నారు. 30లక్షల మంది నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం నియామకాలు చేపడుతున్నామని చెప్పారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీలో నియామకాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. "త్వరలోనే గ్రూప్-1 పరీక్ష నిర్వహిస్తాం. 3,650 రోజులు అధికారంలో ఉండి మీరు ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేదు. తమ ప్రభుత్వం ఏర్పడిన 70 రోజుల్లో 25వేల ఉద్యోగాల నియామకాలు చేపట్టాం.. మీరు ఉరితాళ్లు కట్టుకుని వేలాడినా.. ఇంకేం చేసినా.. ప్రజలు మీపై సానుభూతి చూపరని" అన్నారు. బీఆర్ఎస్ పాలనలో తండాలు, మారుమూల ప్రాంతాల్లో ఉన్న 6,450 పాఠశాలలను మూసేశారని, పేదలకు విద్యను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టి పేదలకు విద్య అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుంటే.. మామా అల్లుళ్లు మమ్మల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారన్నారు. నువ్వు రాజీనామా చెరు నేను చేసి చూపిస్తా అని హరీశ్‌రావు అంటున్నారని, ఆయనను చూస్తుంటే.. మరో ఔరంగజేబులా కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేండ్లు మంత్రిగా ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. మేడిగడ్డపై చర్చకు అసెంబ్లీకి రమ్మంటే రాకుండా పారిపోయిండ్రని.. దశ బాగుంటే దిశతో పని లేదన్నారు. ప్రజలకు ఏం ద్రోహం చేశారో ఇప్పటికైనా కేసీఆర్ తెలుసుకోవాలని సూచించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 1971లో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా పీవీ నరసింహారావు సర్వేల్‌లో గురుకుల పాఠశాలను ప్రారంభించారని, ఆ గురుకులంలో నుంచి వచ్చిన బుర్ర వెంకటేశం, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ వంటి ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు విదేశాల్లోనూ ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. అప్పట్లో 32 ఉంటే.. ఇప్పుడు రాష్ట్రంలో 1022 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు ఉన్నాయన్నారు.
దాదాపు 6.85లక్షల మంది విద్యార్థులు చదివే సంస్థలుగా గురుకులాలు ఎదిగాయన్నారు. 2004-14 మధ్య మెస్ చార్జీలు అన్నీ గ్రీన్ చానల్ ద్వారా పేమెంట్ అయ్యేవని, 2014 తర్వాత రెండేండ్ల వరకు మెస్ చార్జీలు రాక నాణ్యత కొరవడిందన్నారు. సీఎం నాయకత్వంలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ప్రతి మెస్ చార్జీలను గ్రీన్ ఛానల్ ద్వారా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామన్నారు. తమ ప్రభుత్వానికి అండగా ఉండాలని, కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే 25వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.. పనిచేసే ప్రభుత్వం అని తెలిపారు.



## పొత్తులపై బీజేపీ డిసైడ్ అయిందా

# ఏపీలో అనూహ్య మలుపు..!!

ఏపీలో ఎన్నికల వేళ అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఏపీలో వైసీపీ సింగిల్ గా పోటీ చేస్తుంది. టీడీపీ, జనసేన పొత్తుతో ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. అటు కాంగ్రెస్ షర్మిలకు పార్టీ పగ్గాలు అప్పగించి కొత్త వ్యూహాలు అమలు చేస్తోంది. దీంతో, ఇప్పుడు బీజేపీ అలర్ట్ అయింది. పొత్తుల పైన తేల్చకుండానే తమ కార్యాచరణ మొదలు పెట్టింది. పార్టీ అభ్యర్ధుల ఎంపిక పైన కసరత్తు ప్రారంభించింది. 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీకి సిద్దమవుతోంది. ఒంటరి పోరు దిశగా: ఏపీలో బీజేపీ దాదాపు ఒంటరి పోరుకే నిర్ణయించినట్లు కనిపిస్తోంది. టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తు ఖాయమని కొంత కాలంగా ప్రచారం సాగుతోంది. కానీ, క్షేత్ర స్థాయిలో పరిణామాలు భిన్నంగా ఉన్నాయి. ఢిల్లీ నేతల సూచనల మేరకు రాష్ట్ర నాయకత్వం కార్యాచరణ ప్రారంభించింది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లోనూ పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా గురువారం ఒకే రోజున రాష్ట్రవ్యాప్తంగా 25 లోక్‌సభ స్థానాల పరిధిలో పార్టీ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభిస్తోంది. . బీజేపీకి 'రాష్ట్రంలో ఒక్క అవకాశం – కేంద్రంలో మరో విడత' నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం మొదలు పెట్టింది. ఇదే సమయంలో పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్ధుల ఎంపిక కసరత్తు ప్రారంభించింది. అభ్యర్ధుల ఎంపిక: 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ నియోజకవర్గాలకు 2,438 మంది దరఖాస్తు చేసుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల జాతీయ పార్టీ సహ సంఘటన కార్యదర్శి శివప్రకాష్‌తో జరిగిన రాష్ట్ర ముఖ్యనేతల భేటీలో లోక్‌సభ స్థానాల్లో పోటీకి అవకాశం ఉన్న నాయకులు, పార్టీ బలాబలాలపై చర్చించారు. రాజ్యసభ సభ్యులు జీవీఎల్, సీఎం రమేష్, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, సత్యకుమార్, పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్



మాధవ్, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి తదితరులతో పాటు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్న పరిపూర్ణానంద స్వామి కూడా లోక్‌సభ బరిలో నిలిచేలా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ముఖ్య నేతల రాక: ఫిబ్రవరి 4వ తేదీ తర్వాత పార్టీ అగ్రనేతలు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, జెపీ నడ్డా రాష్ట్రంలో పర్యటించనున్నారు. క్లస్టర్ల వారీగా ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. పలు జిల్లాల్లో ప్రాంతంలోని వివిధ రంగాల నిపుణులతో సమావేశమవుతారని పార్టీ వర్గాలు తెలిపారు. జాతీయ, రాష్ట్ర పార్టీ సులభంగా పర్యవేక్షించేలా ఐదేసి లోక్‌సభ నియోజకవర్గాలను ఒక క్లస్టర్‌గా విభజించి, 5 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. దీంతో, బీజేపీ ఒంటరి పోరుకే సిద్దమవుతున్నట్లు సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బీజేపీ పొత్తుకు ముందుకు రాకపోతే పవన్ నిర్ణయం ఏంటనేది ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది. దీని ద్వారా బీజేపీకి దక్కే ఓట్లు ఎవరికి నష్టం చేస్తాయనే చర్చ ఆసక్తి కరంగా మారుతోంది.

# సంఘాల సొమ్ము స్వాహాపై ఫిర్యాదు



1 గాండ్లపెంట, మండల పరిధిలోని గొల్లపల్లికి చెందిన రామాంజులు మహిళా సంఘాల బుక్‌కీపర్, యానిమేటర్‌గా ఉంటూ వారి సొమ్ము స్వాహా చేశాడని ఆ సంఘాల సభ్యులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు.. రామాంజులు పదేళ్లుగా సంఘాలకు సంబంధించిన లావాదేవీలు చూసేందుకు బుక్ కీపర్‌గా పని చేస్తున్నాడు. ఒక్క స్త్రీనిధి ఖాతా మాత్రమే వారికి అందజేశాడు. సభ్యులు ప్రతి నెలా ఆ ఖాతాకు డబ్బులు చెల్లించి మొత్తం అప్పు తీర్చారు. కొత్త అప్పు కోసం బ్యాంక్‌కు వెళ్లారు. 14 సంఘాల వారు బ్యాంక్‌కి రూ.12 లక్షలు బకాయి పడ్డారని దీనిపై మీకు నోటీసులు ఇస్తామని అధికారులు పేర్కొన్నారు. దీంతో మోసపోయామని గ్రహించిన మహిళా సంఘాల సభ్యులు బాధ్యులైన వెలుగు అధికారులు చౌడప్ప, సూర్యనారాయణ, ప్రసాద్, బుక్‌కీపర్ రామాంజులుపై చర్యలు తీసుకుని, వారిని విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు.

# వివాదాస్పద ఎంవీఐ నూతన కార్యాలయం ప్రారంభం

తాడిపత్రి,:తాడిపత్రి మండలంలోని చిన్నపొలమడ గ్రామ పరిసరాల్లో నూతనంగా నిర్మించిన వివాదాస్పద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్నిఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. ఈ నెల 29న తాడిపత్రికి చెందిన సైబుద్దీన్ 383-2 సర్వేనంబర్‌లో తనకున్న భూమిలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని నిర్మించారని హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం హైకోర్టు స్టేటస్ కో ఆర్డర్ జారీ చేసింది. హైకోర్టు 383-2లో నిర్మిస్తున్న ఎంవీఐ కార్యాలయాన్ని నిలుపుదల చేయాలని స్టే ఇచ్చిందని, ప్రస్తుతం కార్యాలయాన్ని 382-బిలో నిర్మించామని అందుకు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారులతో సర్వే నిర్వహించిన తరువాతే ఈ కార్యాలయాన్ని



ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. తాడిపత్రి ఎంవీఐ కార్యాలయాన్ని నిర్మించాలంటే అందుకు సంబంధించిన స్థలం, ప్రభుత్వ అనుమతులు, నిధుల కేటాయింపు, టెండర్ వంటివి అనుసరించాలని, అటువంటివి ఏమీ లేకుండా కార్యాలయాన్ని నిర్మించి ఎవరికీ తెలియకుండా ప్రారంభించడం సరికాదని తెదేపా నాయకులు విమర్శించారు.

# తెదేపా పాలనతోనే అన్నివర్గాల సంక్షేమం

### - ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, నాయకులు

ఉరవకొండ,: రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం తెదేపా పాలనతోనే సాధ్యంమవుతుందని పీఏసీ ఛైర్మన్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని వై.రాంపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. స్థానిక తెదేపా శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. వైకాపా ప్రభుత్వం సంక్షేమం పేరుతో ప్రజలను మోసం చేస్తోందని, నిబంధనల పేరుతో పథకాలను కుదించిందన్నారు. ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురి చేస్తోందని చెప్పారు. తెదేపా అధికారంలోకి వస్తే ఎలాంటి నిబంధనలను అడ్డుపెట్టకుండా, అన్ని పథకాలను సమర్ధంగా అమలు చేయనుందని తెలిపారు. ముందుగా గ్రామస్థులు ఆయనకు



ఘన స్వాగతం పలికారు. హారతులు పట్టి పూలు చల్లుతూ గ్రామంలోకి ఆహ్వానించారు. ఎంపీటీసీ సభ్యులు మోపిడి శ్రీనివాసులు, దేవరాజు, తెదేపా నాయకులు రాజాగౌడ్, సంజీవరాయుడు, ఎర్రిస్వామి, వెంకటనారాయణ, యల్లప్ప, శివశంకర్, చంద్ర, భీమశేఖర్ పాల్గొన్నారు.

# చెలరేగుతున్న మైనింగ్ మాఫియా

తిరుపతి:అక్రమ మార్గంలో గిరి గీసుకొని చెప్పిన చోటే తవ్వుకోవాలంటే.. అక్రమార్కులు ఆగుతారా? ప్రజాభిప్రాయం సేకరించకుండా గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఓజిలి మండలంలోని మాచవరంలో ప్రభుత్వ భూములు
ఆక్రమణకు గురవుతున్నాయి. వీటిని కాపాడాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఓజిలి మండలం మమ్మాయపాలెం రెవెన్యూ పరిధిలోని మాచవరం గ్రామంలో సర్వే నంబర్ 226లో 136 ఎకరాల ప్రభుత్వ భూమి కొండతో కలుపుకొని ఉంది.

2019లో ప్రజాభిప్రాయం సేకరించకుండా గుట్టుచప్పుడు కాకుండా చెన్నైకి చెందిన స్వామినాథన్ అనే వ్యక్తికి మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. సుమారు తొమ్మిది ఎకరాల్లో మాత్రమే తవ్వుకోవాలని మైనింగ్ అధికారులు హద్దులు చూపారు. సరే అని స్థానిక అధికార పార్టీ నాయకులతో చేతులు కలిసి కొండచుట్టూ తవ్వకాలు చేస్తున్నారు. నాలుగు నెలల నుంచి పక్కనే అదే సర్వే నంబర్‌లో ఉన్న భూమిపై కన్నేసి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. అడ్డు చెప్పేవాళ్లు లేకపోవడంతో నేటి వరకు దాదాపు 30 ఎకరాల్లో తవ్వేశారు. నిరంతరం టిప్పర్లలో మట్టి తరలించడంతో రోడ్లు పాడవుతున్నాయి. అటవీ అధికారులు, తహసీల్దారుకు విన్నవించుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు తెలుపుతున్నారు. సమీపంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ల(సెజ్) నిర్మాణాల కారణంగా గ్రావెల్, మెటల్స్‌కు గిరాకీ ఉంది. అదే అవకాశంగా నాలుగు నెలల నుంచి లక్ష యూనిట్లకు పైగా గ్రావెల్‌ను అక్రమంగా తీసుకెళ్లారు. యూనిట్ విలువ దాదాపుగా రూ.5 వేల నుంచి
రూ.6 వేల కోట్ల అక్రమ దందాకు మాచవరం ప్రభుత్వ భూములు బలయ్యాయి. గ్రామంలో కొందరు మైనింగ్ అధికారులను కలిసి విన్నవించుకున్నా ఫలితం లేదు. ఒకవైపు అధికారుల అండదండలు, మరోవైపు పాలకుల ఆశీర్వాదాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఎవరైనా అధికారులు పరిశీలనకు వస్తున్నారని తెలియగానే తమకు కేటాయించిన భూమిలో పనులు చేస్తున్నట్లు నమ్మిస్తున్నారు. మాచవరంలో అక్రమ తవ్వకాల గురించి తెలిసింది. క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తాం.



## శ్రీకృష్ణుడు తలపై నెమలి నెమలి పింఛం


# ఎందుకు ధరిస్తాడో తెలుసా

శ్రీకృష్ణుడు ఎప్పుడూ నెమలి ఈకను తన తలలో అలంకారంగా ధరించి ఎంతో అందంగా కనిపిస్తాడు. నెమలి ఈకతోనే ఆయనకు కళ ఉట్టిపడుతుంది. . అయితే ఆ నెమలి పింఛం ఎందుకు ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించారా?ఆ విధంగా శ్రీ కృష్ణుడు తలపై నెమలి నెమలి పింఛం పెట్టుకోవడానికి గల కారణం ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం. మహావిష్ణువు ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణుడు. ద్వాపర యుగంలో కృష్ణుడిగా అవతరించిన నారాయణుడు దుష్ట శిక్షణ గావించాడు. అయితే ఎనిమిది భార్యలు, పదహారువేల మంది గోపికలతో రాసలీలలు సాగించాడని, అతడు శృంగార పురుషడని తెలియనివారు విమర్శిస్తారు. ఏ అవతార పురుషుడూ ఇంత మంది స్త్రీలను భార్యలుగా పొందలేని అంటారు. శ్రీకృష్ణుని చూడగానే వెంటనే గుర్తుకు వచ్చేది నీలిరంగు మొహం, చేతిలో పిల్లనగ్రోవి, తలపై నెమలి నెమలి పింఛం, చుట్టూ పదహారు వేలమంది గోపికలతో ఎంతో అల్లరి చేస్తూ కనిపిస్తాడు. శ్రీకృష్ణుడు చిన్నతనంలో ఎన్నో అల్లరి పనులు చేస్తూ అందరిని ఎంతో సరదాగా ఆటపట్టిస్తూ ఉండేవాడు. ఇంతటి అల్లరి చేష్టలు కలిగిన కన్నయ్య తలపై నెమలి నెమలి పింఛం ఉంటుంది. శ్రీకృష్ణుడు పదహారు వేల మంది గోపికలతో కేవలం సరస సల్లాపాలు మాత్రమే ఆడాడు. ఎప్పుడూ కూడా వారి విషయంలో హద్దులు దాటి ప్రవర్తించలేదు. తను ఎంతో అల్లరి చేస్తూ ఎంతోమందిని ఆటపట్టించే వాడు. ఈ విధంగా కృష్ణుడు, గోపికల మధ్య ఉన్నది కేవలం ఒక పవిత్రమైన స్నేహం మాత్రమే కృష్ణుడు భోగి రూపంలో కనిపించే ఒక యోగిగా మాత్రమే ఉన్నాడు. శ్రీకృష్ణుడు తన అల్లరి చేష్టలతో ఎంతోమందిని ఆకట్టుకున్న శ్రీ కృష్ణుడు తన తలపై ఉన్న



నెమలి పింఛం విషయానికి వస్తే ప్రపంచంలోనే సంభోగం చేయని జీవిగా నెమలిని చెప్పవచ్చు. అదేవిధంగా పదహారు వేల మంది గోపికలు ఉన్నా శ్రీకృష్ణుడు కూడా ఎంతో పరమ పవిత్రుడు అని భావించి నెమలి నెమలి పింఛాన్ని శ్రీకృష్ణుడి తలపై ధరించాడు. ఈ నెమలి పింఛం శ్రీకృష్ణుడు తలపై ధరించడం వల్ల అతని పవిత్రతను తెలియజేస్తుంది. అంతేకాకుండా నెమలిని ఒక పవిత్రమైన పక్షిగా మన హిందువులు భావిస్తారు. నెమలి పింఛం మన ఇంటిలో ఉండటం వల్ల సకల సంపదలు కలుగుతాయని భావిస్తారు కేవలం నాస్తికులే కాదు భగవంతుడిని నమ్మేవారు కూడా కృష్ణుడు కామ స్వరూపమేనని భావిస్తారు. కానీ కృష్ణతత్వాన్ని తప్పుగా భావించ కూడా... ఆయన శిఖలోని నెమలి ఫించం భోగి రూపంలోని యోగేశ్వరుడని తెలియజేయ దానికి సంకేతం.ఆ జగన్నాటక సూత్రధారి లీలలు తెలిసిన వారు మాత్రం ఈ విమర్శలను తిప్పికొడతారు.

# అన్నదాతలు వద్దంటున్నా బలవంతపు బిగింపు



అనంతపురం:తమ పొలాల్లో విద్యుత్తు మీటర్లను బిగించొద్దని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారికి మద్దతుగా ప్రతిపక్ష, వామపక్ష, రైతు సంఘాల నేతలు ఆందోళనలు చేపడుతున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు మీటర్ల బిగింపుపై వ్యతిరేకించినా వైకాపా ప్రభుత్వం మాత్రం ముందుకే వెళ్తోందని, రైతులకు సమాచారం ఇవ్వకుండా ఏకంగా వారి పొలాల్లోకి శిర్డీ సాయి గుత్తేదారు సంస్థ సిబ్బంది వెళ్లి మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఏ విధంగా రీడింగ్ తీస్తారో అనే విషయంపై రైతులకు అవగాహన లేదన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 22 వేల మీటర్లను బిగించామని విద్యుత్తు అధికారుల లెక్కలు చెబుతున్నా వీటికి ఇప్పటి వరకూ బిల్లులు జారీ చేయకపోవటం గమనార్హం. రైతుల పొలాల్లో ఒక్కో మీటరుకు విద్యుత్తు శాఖ రూ.11,660 ధర నిర్ణయించింది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 2.70 లక్షల వ్యవసాయ సర్వీసులకు 2024 ఆగస్టు నెలాఖరులోపు విద్యుత్తు మీటర్లను సిద్ధం చేసుకోవాలని నిర్ణయించారు. కాంట్రాక్టు శిర్డీ సాయి సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ సిబ్బంది హిందూపురం, గుత్తి డివిజన్ పరిధి మారుమూల గ్రామాలు, కదిరి పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో 22 వేల మీటర్లను బిగించినట్లు అధికారులు చెబుతున్నారు. మీటర్లు బిగించుకోకపోతే విద్యుత్తు సర్వీసు తొలగిస్తామని, రాయితీలు నిలిపివేస్తామని బెదిరిస్తుండటంతో కొంతమంది రైతులు మనోవేదనకు గురవుతున్నారు. భవిష్యత్తులో మీటర్ల బిగింపు ద్వారా వచ్చే నష్టం తెలిసినా అధికార పార్టీ అన్న నెపంతో కొన్నిచోట్ల ఏమీ మాట్లాడకుండా ఊరుకుండి పోతున్నారు. నీ కనీసం మీటర్లు ఎలా పనిచేస్తాయి, రీడింగ్ ఎలా తీస్తారన్న వివరాలపై అవగాహన కల్పించకపోవడంతో కర్షకులు మండిపడుతున్నారు. కమీషన్ల కోసం రైతుల పొలాల్లో మీటర్లను బిగించేందుకు సీఎం జగన్ ముందుకు వచ్చారు. రైతులందరం కలిసి అడ్డుకుంటున్నాం. రైతులను బెదిరించి వారితో దొడ్డిదారిన డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పేరుతో బ్యాంకు ఖాతా వివరాలను తీసుకుని సర్వీసులకు మీటర్లు బిగిస్తున్నారు.

# మఠం భూముల సంరక్షణలో నిస్తేజం

తిరుపతి :హథీరాంజీ మఠం భూములకు రక్షణ కరవైంది. మఠం ఆస్తులు, భూములు నగరంలో పెద్దఎత్తున ఉండగా వాటిని ఎక్కడికక్కడ ఆక్రమించేస్తున్నారు. నగరాభివృద్ధిలో భాగంగా చేస్తున్న పనులతో కొంత అన్యాక్రాంతమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లు నూతనంగా నిర్మించారు. మధ్యలో కూడళ్లు.. వాటిలో విగ్రహాలు ఏర్పాటు చేశారు. తిరుచానూరు నుంచి లక్ష్మీపురం కూడలి వరకు శ్రీనివాససేతు కింద ఇరువైపులా పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్పాత్‌ను ఏర్పాటు చేశారు. గతంలో రోడ్డుపై ఉన్న వ్యాపారాలను ఫుట్పాత్ ఆవలకు తరలించాలన్న నగరపాలక సంస్థ సూచనలతో మఠం భూముల్లో పాగావేస్తున్నారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని తెల్లగుంట సర్వే నంబరు 57/1, 57/3లో గతంలో 20 ఎకరాల పైగా మఠం భూమి ఉండేది. ప్రభుత్వ, తితిదే భవనాల నిర్మాణాలకు, రోడ్డుకుపోను కొంత భూమి మిగిలింది. శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల ఎదుట, శ్రీపద్మావతి కల్యాణ మండపాలకు పక్కన మిగిలిన భూమిని ఏళ్లుగా వదిలేశారు. మహంత్ అర్జున్‌దాస్ సస్పెండ్ అయిన తరువాత పట్టించుకొనేవారు కరవయ్యారు. తిరుచానూరు రోడ్డులోని మఠం భూమిలో కార్పొరేషన్ అధికారులు కొంత రోడ్డు వేశారు. మధ్యలో కొన్ని బొమ్మలు ఏర్పాటు చేశారు. భూమి యజమాని అయిన మఠానికి చెందిన అధికారులకు ఇంతవరకు కార్పొరేషన్ అధికారులు సమాచారం



ఇవ్వలేదని అధికారులు అంటుండగా.. అధికారులు సైతం పరిశీలన చేయకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఃతిరుచానూరు రోడ్డు.. శ్రీపద్మావతి కల్యాణ మండపాలకు పక్కనున్న మఠం భూమి అన్యాక్రాంతం అవుతోంది. గతంలో భైరాగిపట్టెడ మార్గంలోని చిన్నపాటి వ్యాపారులను ఖాళీ చేయించి పక్కనే రోడ్డుపై ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. స్థానిక నాయకుల ప్రోత్సాహంతో వారు మఠం భూమిలో పాకలు వేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. తోపుడుబండ్ల నుంచి పార్కింగ్ వరకు అనువుగా స్థలాన్ని చదునుచేస్తూ పోతున్నారు. మరోవైపు వాహనాల్లో తీసుకొచ్చిన చెత్తను అక్కడే వేస్తున్నారు. వీటిని ఇలాగే వదిలేస్తే మఠం భూమి ప్రైవేటు వ్యాపార సముదాయంగా మారే అవకాశం ఉంది.

# పరిశ్రమలు పరార్

నాయుడుపేట : స్థానికులకు ఉపాధి అవకాశం కల్పిస్తామన్న ముఖ్యమంత్రి జగన్ హామీలు నీటి మూటలుగానే మిగిలాయి. ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఆయన స్థానికులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేరలేదు. ఓజిలి మండలం అత్తివరంలో 406.26 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేశారు. ఇందులో 64 ప్లాట్లు ఏర్పాటు చేశారు. సుమారుగా 14 ప్లాట్లు పూర్తి కాగా మరో కొన్ని పరిశ్రమలు దరఖాస్తు చేసుకున్నాయి. సుమారుగా 17 వరకుపరిశ్రమలు రాగా కొన్ని మూతపడ్డాయి. సుమారుగా 40 ప్లాట్లు ఖాళీగానే ఉన్నాయి. ఇక్కడ వాడలో 12.21 ఎకరాలు కామన్ ఏరియా కాగా ఇక్కడ పరిపాలన భవనం, ఇందులో బ్యాంకు, ఏటీఎం, క్యాంటీన్, తపాలా శాఖ కార్యాలయం, వే బ్రిడ్జి, ట్రక్ పార్కింగ్ ఏరియా, ఫైర్ స్టేషన్,ఫుడ్,హెల్త్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిఉంది. ఇవన్నీ ఇక్కడ ఏర్పాటు కాకపోగా వచ్చే పరిశ్రమలు వెనక్కి వెళ్లాయి. ముమ్మాయపాళెం రెవెన్యూ మాచవరం వద్ద సుమారుగా 100 ఎకరాల్లో ఏర్పాటు చేయదలిచిన ప్రీమియర్ ఎక్స్‌ప్లోసివ్ లిమిటెడ్ కంపెనీ ఐదేళ్లుగా ప్రయత్నిస్తున్నా భూమి అప్పగింత చేపట్టలేదు. ఇక్కడ ఎస్సీ, ఎస్టీలను రెచ్చగొడుతున్న అధికార పార్టీ నాయకుల తీరుతో పరిశ్రమ వెనక్కి మళ్లింది. పెళ్లకూరు మండలం శిరసనంబేడులో ఏపీఐఐసీ తీసుకున్న భూమి సుమారుగా 200 ఎకరాలు అందుబాటులో ఉంది. ఇక్కడ ఒకే ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాగా ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ రాని పరిస్థితి. ఇక్కడ భూమి తీసుకున్న రెండు సంస్థలు వెనక్కి వెళ్లాయి.



పరిశ్రమలకు అవసరం అయిన మౌలిక వసతులు ఇక్కడ అందుబాటులో లేకపోవడం మరో కారణంగా ఉంది. వైకాపా వచ్చిన తర్వాత ఇక్కడ రూ.నిధులు కూడా వెచ్చించలేదు. ఇక్కడ వాడలో సుమారుగా 3,986 కేఎల్‌డీలు కాగా ప్రస్తుత అవసరాలకు 15 కేఎల్‌డీలు ఉన్నా అన్ని ట్యాంకర్ల ద్వారా కొనాల్సి వస్తోంది. కొందరు సొంత బోర్లు ఏర్పాటు చేసుకోగా తాగడానికి అష్టకష్టాలు పడుతున్నారు.

# కుష్టుపై అవగాహన కల్పించాలి

ఎదులాపురం: కుష్టు వ్యాధిపై మరింత అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని హమాలీవాడ యూపీహెచ్‌సీలో జాతీయ కుష్టు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియా లేప్రే అనే బాక్టీరియా వల్ల వస్తుందన్నారు. స్పర్శ్ పక్షోత్సవాల్లో భాగంగా ఈ నెల30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కుష్టు నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గజానన్ మాట్లాడుతూ ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అంతకుముందు మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని మహాత్మాగాంధీ చిత్రపటానికి, కుష్టు వ్యాధి కారక సూక్ష్మక్రిమిని కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ హన్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలందరి సహకారంతో కుష్టు నివారణ సాధ్యమవుతుందని వైద్యురాలు నయనత అన్నారు. మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా జైనథ్ గ్రామ పంచాయతీలో కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల భాగంగా అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. గ్రామానికి చెందిన కుష్టు వ్యాధిగ్రస్తురాలిని సన్మానించారు. కార్యక్రమంలో సూజర్‌వైజర్ వేణు,



సర్పంచ్ దేవన్న, గణేశ్ యాదవ్, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. బోథ్ గ్రామ పంచాయతీలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు కుష్టు వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేశారు.

కుష్టు వ్యాధిపై నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. గుంజాల గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది హిమబిందు, ఈశ్వరి, విద్యారాణి, ఉపాధ్యాయుడు రాంరావ్, ఉప సర్పంచ్ చంద, ఆశకార్యకర్తలు సత్యశీల, నాగుబాయి పాల్గొన్నారు.

# హక్కులపై అవగాహన ఉండాలి:కలెక్టర్




నస్పూర్, : ప్రజలు పౌర హక్కులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు, జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఆర్డీవో రాములు, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు తిరుపతిరెడ్డి, మోహన్, జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అట్రాసిటీ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి, బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని, చట్టంపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. 2016 జిల్లా ఏర్పాటు అనంతరం ఇప్పటి వరకు 2012-22 వరకు వివిధ కేసుల్లో 447 మంది బాధితులకు రూ.4,75,44, 750 పరిహారం మంజూరు చేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యుల ప్రతిపాదన మేరకు మందమర్రి మండలం ఎర్రగుంటపల్లిలో అ క్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులను మూ సివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దండేపల్లి మండలం లింగాపూర్‌లో ప్రజల సౌకర్యార్థం అప్రోచ్‌రోడ్డు పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు విచారణతో పాటు ఎఫ్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు సంబంధిత ఎస్‌హెచ్‌వోలు, సీఐలు, ఎస్ఐల సమన్వయంతో విచారణ ప్రక్రియ వేగంగా జరుపుతామని తెలిపారు. సివిల్ రైట్స్‌డే సందర్భంగా సీఐలు, ఎస్ఐలు గ్రామసభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం, కమిటీ సభ్యులు వెంకటేశం, అంజయ్య, సత్యనారాయణ, లింగయ్య, స్వచ్ఛంద సంస్థల సభ్యులు మాధవన్, సరోజ, అధికారులు పాల్గొన్నారు. అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణులతో సహా సహజ పర్యావరణాన్ని రక్షించడం, మెరుగు పర్చడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు.

# 'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సాగాలి

మంచిర్యాల : పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా బోధన, రివిజన్, ప్రిపరేషన్ చేయించాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, బెల్లంపల్లి, కాసిపేట, తాండూరు, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల ప్రభుత్వ, కేజీబీవీ, ఎయిడెడ్, మోడల్ స్కూళ్ల హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 31వ తేదీలోగా ప్రతి పాఠశాలలో పదో తరగతి సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులను పరీక్షలకు ఎలా సంసిద్ధులను చేయాలో హెచ్ఎంలు రివ్యూ చేస్తూ 100 శాతం ఫలితాలు సాధించడానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కచ్చితంగా నిర్వహిస్తూ రివిజన్




చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీజీఈ దామోదర్ రావు, డీసీఈబీ సెక్రటరీ కొండు భీంరావు, ఎంఈవోలు తిరుపతి రెడ్డి, విజయ్‌కుమార్, ప్రభాకర్, మహేశ్వర్ రెడ్డి, సెక్టోరల్ అధికారి సత్యనారాయణ మూర్తి, యశోధర పాల్గొన్నారు.

# వివాదాస్పద ఉపాధ్యాయులను బదిలీ చేయాలి



ఉట్నూర్:ఉట్నూర్ మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వివాదాస్పద ఉపాధ్యాయులు శామ్యూల్, వీరయ్యలను వెంటనే బదిలీ చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని లక్కారం గ్రామస్తులు అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్రం తిరుపతి, నీలాబాయి, అన్నపూర్ణ, తొగరి రఘు, కాల్వ రవి మాట్లాడారు. ఇటీవల ఉన్నత పాఠశాల నూతన భవనానికి పాత పాఠశాల నుంచి విద్యార్థులతో సామగ్రిని మోపిస్తూ ఉన్న ఉపాధ్యాయులను గ్రామస్తులు రాకేశ్ అనే యువకుడు ప్రశ్నించగా ఆయనపై ఉపాధ్యాయుడు శామ్యూల్ దాడిచేశారని, దీంతో రాకేశ్ సైతం ఉపాధ్యాయుడిపై చేయిచేసుకున్నాడని తెలిపారు. ఇదే అదునుగా సదరు ఉపాధ్యాయుడు రాకేశ్‌పై ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేసి కులం పేరుతో దూషించాడని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించాడని వివరించారు. గతంలో ఈ పాఠశాలలో పనిచేసిన స్వామి ఉపాధ్యాయుడిపై కూడా సదరు ఉపాధ్యాయుడు ఇన్‌చార్జి హెచ్ఎంగా ఉన్న సమయంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడని, పోలీసులు ఉపాధ్యాయుడిపై ఫోక్స్ చట్టం కేసు నమోదు చేశారని వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సెలబస్ పూర్తి చేయడంలో విఫలమవతున్నారని ఆరోపించారు. ఈ వివాదస్పద ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారికి ఫిర్యాదు చేస్తున్నట్లు వివరించారు. ఈ విషయమై ఉపాధ్యాయుడు శామ్యూల్‌ను వివరణ కోరగా.. పాఠశాల సమస్య ఏదైనా ఉంటే పాఠశాల హెచ్ఎంను అడిగాలి కాని తనతో వాగ్వాదానికి దిగి తనపై దాడి చేయడం, అసత్య ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

# మంథని-మహారాష్ట్రకు ఆర్టీసీ బస్సులు బంద్

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని నుంచి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు నడుస్తున్న ఆర్టీసీ బస్సులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రధానంగా మంథని నుంచి చంద్రాపూర్, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం మధ్య చాలాకాలంగా రెండు చొప్పున ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. అయితే 20 రోజులుగా ఈ మార్గాల్లో అధికారులు బస్సులు నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుండడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. అదే సమయంలో లాభాలు మాత్రం రావడం లేదు. ఇలాంటి రూట్లలో నడిచే బస్సులను రద్దు చేస్తూ ఆదాయం అధికంగా ఉండే ప్రాంతాలకు బస్సులను సర్దుబాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మంథని డిపో నుంచి దూర ప్రాంతాలకు నడిపించే సర్వీసులను నిలిపివేస్తున్నారని సమాచారం. మంథని డివిజన్‌కు చెందిన వేలాది మంది ప్రజలు మహారాష్ట్రలోని చంద్రాపూర్, బల్హార్షా, గుగ్గూస్, బావుపేట్, రాజూరా, వణి, మాంజీరి తదితర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. మరికొందరు నిత్యం ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వీరికోసం మంథని డిపోనుంచి రోజూ ఉదయం 6.30 గంటలకు, మధ్యాహ్నం 1.30



గంటలకు రెండు బస్సులు నడిపిస్తూ వచ్చారు. ఇప్పుడు వాటిని రద్దుచేయడంతోవారంతా అవస్థలు పడుతున్నారు. గతంలోనాగపూర్, రామగిరి తోపాటు లోకల్ ప్యాసింజర్ రైళ్లు నడవగా.. వాటిద్వారా ప్రయాణం చేసేవారు. ఇప్పుడవి నడవడంలేదు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నా.. కాగజ్‌నగర్ వరకు రిజర్వేషన్ చేయించాలి. అక్కడినుంచి మళ్లీ బస్సులనే ఆశ్రయించాలి. బస్సులు రద్దు కావడంతో మంచిర్యాల వరకు సౌకర్యం బాగానే ఉన్నా.. ఆసిఫాబాద్ నుంచి రాజురా.. అక్కడి నుంచి చంద్రాపూర్, బల్హాం భద్రాద్రి రామచంద్రుడి దర్శనం కోసం మంథని ప్రాంతం నుంచి చాలామంది భక్తులు తరలివెళ్తుంటారు.

# చిత్తశుద్ధి చూపేదెప్పుడు?

సిరిసిల్ల:మురుగు శుద్ధిపై చిత్తశుద్ధి లోపిస్తోంది. వ్యర్థ జలాల నిర్వహణకు సరైన వ్యవస్థ లేక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఫలితంగా అటు పర్యావరణానికి.. ఇటు పట్టణ ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. జిల్లాలోని రెండు పట్టణాల్లోనూ మురుగునీటి నిర్వహణ లేదు. సిరిసిల్ల పురపాలికకు ఏడాది క్రితం ఎస్టీపీ (మురుగు శుద్ధి కేంద్రం) మంజూరైంది. పనులు మాత్రం అసంపూర్తి దశలోనే ఉన్నాయి. వేములవాడ పురపాలికలో ప్రతిపాదనలకే పరిమితమైంది. పట్టణాల్లోని గృహ సముదాయాల నుంచి వెలువడే వ్యర్థ జలాలు నాలాలు, డ్రైయిన్ల ద్వారా నేరుగా వాగుల్లో కలుస్తున్నాయి. ఇలా కాకుండా మురుగంతా ఎస్టీపీలకు తరలించి అక్కడ శుద్ధి చేసి పునర్వినియోగిస్తే కాలుష్యం తగ్గడంతోపాటు పట్టణాల్లో వరద సమస్యకూ ఓ పరిష్కారం లభిస్తుంది. ఇలా చేస్తే పట్టణాలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వాటర్ ప్లస్ జాబితాలోకి చేరుతాయి. కేంద్రం నుంచి ప్రోత్సాహకాలు లభిస్తాయి. జిల్లాలోని సిరిసిల్ల పురపాలికలో 33,008 గృహాలు, 92 వేల జనాభా ఉంది. పట్టణం మొత్తానికి పద్మానగర్, వెంకంపేట నుంచి శాంతినగర్ మీదుగా మానేరు, మరోవైపు కొత్తచెరువు శ్రీనగర్‌కాలనీ నుంచి మానేరులోకి మురుగునీరు వెళ్తోంది. పద్మానగర్ ఎగువ నుంచి వచ్చే మురుగంతా వ్యర్థాలతో నేరుగా కొత్తచెరువులోకి వెళ్లకుండా అక్కడ ఈటీపీ (ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను ఏర్పాటు చేశారు. వర్షాకాలం వరదనీరు సాఫీగా వెళ్లడంలేదని పక్కన పెట్టారు. దీంతో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు నేరుగా కొత్తచెరువులోకి వెళ్తున్నాయి. దీంతోనే ప్రధాన కాల్వల్లో నీరు సాఫీగా వెళ్లలేని పరిస్థితి. ద్రవ వ్యర్థాలతోపాటు డైయింగ్ యూనిట్ల నుంచి వెలువడుతున్న రంగులు, రసాయనాలు.. రాజరాజేశ్వర జలాశయం వెనక జలాల్లో కలుస్తున్నాయి.ః రోజుకు సగటున 20 ఎంఎల్‌డీ (మిలియన్ లిక్విడ్ డిశ్చార్జి)లకు పైగా మురుగు వెలువడుతోంది.



రెండేళ్ల క్రితం వరకు మురుగునీరు ఇలా జలాశయంలో కలవడంలో పెద్ద సమస్యలేవీ ఉత్పన్నం కాలేదు. కాగా వేసవిలో జలాశయంలో నీటి నిల్వ 15 టీఎంసీల దిగువకు చేరినపుడు నీటిలో రంగు, గాఢతల స్థాయి పెరుగుతోంది. దీంతో అగ్రహారంలోని భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో నిర్వహణ సమస్యలు తలెత్తుతున్నాయి. దీని ప్రభావం గ్రామాలకు శుద్ధజలం సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. పట్టణం నుంచి వెలువడుతున్న మురుగునీటిని శుద్ధిచేసి జలాశయంలోకి పంపడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.సిరిసిల్ల పురపాలికలో రూ.61 కోట్లతో స్టేజ్-1, స్టేజ్-2లో ఎస్టీపీ నిర్మాణం చేపట్టనున్నారు. దీనిలో స్టేజ్-1లో రూ.39 కోట్లతో పనులు జరుగుతున్నాయి. 90 శాతం పనులు పూర్తయ్యాయి. విద్యుత్తు పరికరాలు, మోటార్ల బిగింపు ప్రక్రియ మిగిలి ఉంది. గుత్తేదారుకు రూ.25 కోట్ల వరకు బకాయిలు ఉండటంతో పనులు నెమ్మదించాయి. మార్చితో గుత్తేదారు పనుల గడువు ముగియనుంది. ఈ లోపు పనులు పూర్తి చేయాలి. ఎస్టీపీ పని చేయడం ప్రారంభమైతే పట్టణంలో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

# భగీరథ బాధలు తీరేదెన్నడు?




పెద్దపల్లి : కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి జనాభా 830. గ్రామంలో పైపులైన్ నిర్మించి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చారు. మొదట్లో కొద్దిగా నీరు వచ్చేది. ప్రస్తుతం గ్రామంలో ఎక్కడా నీరు రావడం లేదు. స్థానికులు పాత పథకాలు, ఇతర వనరులతో అవసరాలు తీర్చుకుంటున్నారు. ఓదెల మండలం ఉప్పరపల్లిలో తరచూ పైపులైన్లు లీకవుతున్నాయి. మరమ్మతు చేసినా పగిలిపోతోంది. దీంతో లీకేజీని అరికట్టకుండా వదిలేశారు. పైపుల లీకుతో నీరు కలుషితమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకుర్తి మండలం జీడీనగర్‌లో రూ.20 లక్షలతో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత తాగునీటి పథకాన్ని నిర్మించారు. నీటి సరఫరా కనెక్షన్ కోసం స్థానికులు రెండేళ్లుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదు. తాగునీటి అవసరాలకు ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో నాసిరకమైన పనులకు తోడు గతేడాది భారీ వర్షాలకు పైపులైన్లు దెబ్బతిన్నాయి. పైపులైన్ల లీకేజీలపై అటు పంచాయతీ, ఇటు భగీరథ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా స్పందన కరవైంది. పంచాయతీలకు మంజూరు చేసే నిధుల్లో అధికంగా తాగునీటి సరఫరాకే వెచ్చిస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై సమగ్ర వివరాలు సేకరించాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించడంతో అధికారులు కార్యక్షేత్రంలోకి దిగారు. వేసవి ఎద్దడి నివారణకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. జిల్లాలోని 266 పంచాయతీల పరిధిలోని 436 ఆవాసాల్లో 352 రక్షిత తాగునీటి పథకాలు నిర్మించారు. జిల్లావ్యాప్తంగా 1,47,481 కనెక్షన్లు ఇచ్చారు. ఎల్లంపల్లి జలాశయం నుంచి ప్రతి ఇంటికీ 400 లీటర్ల చొప్పున 1.85 టీఎంసీల నీటిని సరఫరా చేస్తున్నారు. 436 ఆవాసాల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నా సంపూర్ణంగా సరఫరా చేస్తున్నట్లు పంచాయతీలు తీర్మానాలిచ్చాయి. ఉన్నతాధికారుల ఒత్తిడితో తీర్మానాలు ఇవ్వాల్సి వచ్చిందని సర్పంచులు చెబుతున్నారు. మిషన్ భగీరథ పథకంలో జిల్లాకు కేటాయించిన మిగులు నిధులతో నిర్మించిన 31 రక్షిత పథకాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మంథని నియోజకవర్గంలో రెండేళ్లుగా వృథాగా వదిలేశారు. గ్రామాల్లో మరమ్మతులు, నిర్వహణ కోసం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం)లో జిల్లాకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదించగా అప్పటి ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో పంచాయతీలకు మరమ్మతు భారంగా మారింది. మంథని మండలం భట్టుపల్లి సమీపంలోని చిన్న గుట్టపై ట్యాంకు నిర్మించి భట్టుపల్లి, ఖాన్‌సాయిపేట, ఆరెంద, వెంకటాపూర్, అడవిసోమన్‌పల్లి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ప్రధాన ట్యాంక్‌కు నీరు సక్రమంగా రాకపోవడంతో అయిదు గ్రామాలకు ఇబ్బందిగా మారింది.

# రహదారుల నిర్మాణమెప్పుడో?



సిరిసిల్ల: జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. రెండేళ్లుగా రహదారుల మరమ్మతులకు సంబంధించి పనులు సరిగా సాగకపోవడంతో రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. వీటికితోడు గత జులైలో కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా సుమారు వంద కిలోమీటర్ల మేర రహదారులు, పలుచోట్ల వంతెనలు, కల్వర్టులు శిథిలమయ్యాయి. వీటికి రూ.35 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. శాశ్వత మరమ్మతులతోపాటు వంతెనలు, కల్వర్టుల నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం ఇంజినీరింగ్‌శాఖలతో సమీక్ష నిర్వహించింది. జిల్లా నుంచి పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.29.30 కోట్లతో కొత్త రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటికి సెప్టెంబరు నెలలో నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. టెండర్ల ప్రక్రియలో ఉండగానే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుతం ఈ పనులన్నీ రద్దు చేశారు. వేములవాడ డివిజన్‌లో వేములవాడ చెక్కపల్లి రహదారికి రూ.2.60 కోట్లు, కోనరావుపేట మండలం ఎక్లాస్‌పూర్, కోనరావుపేట మండల కేంద్రంలోని వంతెన నిర్మాణాలకు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. దీనిలో ఎక్లాస్‌పూర్‌లో వంతెన పూర్తయినా ఇరువైపులా రహదారి అసంపూర్తిగా మిగిలింది. మండల కేంద్రంలో వంతెన నిర్మాణ దశలో ఉంది. మొత్తం నాలుగు రహదారులకు రూ.6.30 కోట్లు మంజూరు కాగా వాటిలో రూ.1.49 కోట్లతో చేపట్టిన ఇల్లంతకుంట మండలం ఆరేపల్లి, రేపాక రహదారి మాత్రమే పూర్తయింది. ఈ పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఎస్టీవోలో పెండింగ్‌లో ఉన్నాయి. సీఆర్ఆర్ కొత్త రహదారుల పనుల్లో భాగంగా గంభీరావుపేట మండలం కొత్తపల్లి నుంచి రాజుపేట రహదారి 3.50 కిలోమీటర్ల మేర పూర్తిగా శిథిలమైంది. దీనికి రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీర్నపల్లి మండలం కేలోతుతండా, ఎల్లారెడ్డిపేటలో గిద్దెచెరువు-రాజన్నపేట, ముస్తాబాద్ మండలం నామాపూర్, తంగళ్లపల్లి మండలం మండేపల్లి, ఇందిరమ్మనగర్ రహదారి నిర్మాణం, గంభీరావుపేట మండలం గోరంటాల రత్నగిరిపల్లి, ముస్తాబాద్ మండలం గూడూరు పోత్గల్‌లో వంతెనల నిర్మాణం చేపట్టాలి. బోయినపల్లి మండలం కోరెం, నల్లగొండ రహదారి, చందుర్తి మండలం ఎల్గల్ నుంచి మామిడిపల్లి మొత్తం 34.40 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు రూ.24 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

# పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించాలి

మహబూబ్‌నగర్:పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కాలుష్య నియంత్రణ మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలుష్యంతో వ్యవసాయ పొలాలు, జంతువులు వంటి వాటికి హాని కలగకుండా చూడాలన్నారు. జడ్చర్ల సమీపంలోని పోలేపల్లి సెజ్‌లో ఉన్న పరిశ్రమలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, ప్రతినెలా 12న నివేదిక ఇవ్వాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన తాగునీటిని మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేసేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ నీటిని చెరువులు, ఇతర ప్రాంతాల్లోకి వెళ్లకుండా ఏ రోజుకారోజు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాలని ఆదేశించారు. వృథా నీరు వెళ్లేందుకు ప్రత్యేక కెనాల్ నిర్మించాలని తెలిపారు. భూగర్భజలాలు కలుషితం కాకుండా కాలుష్య నియంత్రణ మండలి సరైన ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన



జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ బాబూరావు, కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త విద్యులత, డీఎంహెచ్‌ఓ కృష్ణ, మత్స్య శాఖ ఏడీ రాధారోహిణి, వ్యవసాయాధికారి వెంకటేశ్, గ్రౌండ్ వాటర్ డీడీ రాజేందర్ ఉన్నారు.

## అతడితో డ్యాన్స్ చేయడానికి భయపడ్డా: కృతి సనన్




3 సినీ నేపథ్యం లేకపోయినా కృతి సనన్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వరుస సినిమాలతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు. తాజాగా షాహిద్ కపూర్ సరసన 'తేరీ బాతోమే ఐసా ఉల్జా జియా'లో నటించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "ఏ హీరోతోనైనా మొదటిసారి డ్యాన్స్ చేయాలంటే భయపడతాను. షాహిద్ కపూర్ అద్భుతంగా డ్యాన్స్ చేస్తారు. ఇండస్ట్రీలో నాకు డ్యాన్సర్‌లలో అతడు ఒకరు. అతడి వేగానికి మ్యాచ్ అయ్యేలా డ్యాన్స్ వేయాలంటే భయమేసింది. కానీ జాగ్రత్తగా చేసేశా.

## తమిళ హీరోలపై వందల కోట్లు బిజినెస్.. మన హీరోల మాటేంటి.?

తెలుగు హీరోలు ఖాళీగా లేరా లేదంటే దర్శకులు చెప్పిన కథలు మన హీరోలకు నచ్చడం లేదా..? ఉన్నట్లుండి ఈ డౌట్ ఇప్పుడెందుకు అనుకుంటున్నారా..? మరెందుకు రాదు చెప్పండి.. ఒకప్పుడు తమిళ హీరోలతో చేయడానికే ఒకటికి పదిసార్లు ఆలోచించే మన నిర్మాతలు.. ఇప్పుడు వాళ్లకే వందల కోట్లు ఇస్తున్నారు. అసలెందుకు ఈ పరిస్థితి వచ్చిందంటారు..?తెలుగు హీరోలు ఖాళీగా లేరా లేదంటే దర్శకులు చెప్పిన కథలు మన హీరోలకు నచ్చడం లేదా..? ఉన్నట్లుండి ఈ డౌట్ ఇప్పుడెందుకు అనుకుంటున్నారా..? మరెందుకు రాదు చెప్పండి.. ఒకప్పుడు తమిళ హీరోలతో చేయడానికే ఒకటికి పదిసార్లు ఆలోచించే మన నిర్మాతలు.. ఇప్పుడు వాళ్లకే వందల కోట్లు ఇస్తున్నారు. అసలెందుకు ఈ పరిస్థితి వచ్చిందంటారు..?తెలుగులో విజయ్ లు విడుదల చేయడానికి కూడా నిర్మాతలు ఆలోచించారు..





## గ్లామర్ డోస్ పెంచిన రాశీఖన్నా..!

# అవకాశాల కోసమేనా..?

దాదాపు దశాబ్ద కాలంగా వెండితెర మీద కొనసాగుతున్నా.. స్టార్ హీరోయిన్‌గా ప్రూవ్ చేసుకోలేకపోతున్నారు గ్లామర్ క్వీన్ రాశీఖన్నా. అందుకే... ట్రెండ్ మార్చి డిజిటల్ ఆడియన్స్‌కు చేరువయ్యేందుకు కష్టపడుతున్నారు. పెద్దగా అప్‌డేట్స్ లేకపోవటంతో మీడియా అటెన్షన్‌ను గ్రాబ్ చేసేందుకు గ్లామర్ షోతో రచ్చ చేస్తున్నారు. సిల్వర్ స్క్రీన్ మీద బిజీగా లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం టెంపరేయర్ రెయిజ్ చేస్తున్నారు టాలీవుడ్ బ్యూటీ రాశీఖన్నా.దాదాపు దశాబ్ద కాలంగా వెండితెర మీద కొనసాగుతున్నా.. స్టార్ హీరోయిన్‌గా ప్రూవ్ చేసుకోలేకపోతున్నారు గ్లామర్ క్వీన్ రాశీఖన్నా. అందుకే... ట్రెండ్ మార్చి డిజిటల్ ఆడియన్స్‌కు చేరువయ్యేందుకు కష్టపడుతున్నారు. పెద్దగా అప్‌డేట్స్ లేకపోవటంతో మీడియా అటెన్షన్‌ను గ్రాబ్ చేసేందుకు గ్లామర్ షోతో రచ్చ చేస్తున్నారు. సిల్వర్ స్క్రీన్ మీద బిజీగా లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం టెంపరేయర్ రెయిజ్ చేస్తున్నారు టాలీవుడ్ బ్యూటీ రాశీఖన్నా. వరుస ఫోటో షూట్‌లతో హల్ చేస్తున్న రాశీ, ఇప్పుడు హాట్‌నెస్ ఓవర్ లోడెడ్ అన్న రేంజ్‌లో రెచ్చిపోతున్నారు. మూవీ అప్‌డేట్స్‌తో న్యూస్‌లో కనిపించకపోయినా... గ్లామర్ అప్‌డేట్స్‌తో మాత్రం గట్టిగానే సందడి చేస్తున్నారు. నటిగా రొటీన్ మోడ్రన్ గర్ల్ క్యారెక్టర్స్ మాత్రమే వస్తుండటంతో సోషల్ మీడియాలో వేరియేషన్స్ చూపిస్తున్నారు రాశీ. తాజాగా ఈ బ్యూటీ వీడియో ఒకటి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అల్ట్రా మోడ్రన్‌గా టూ హాట్ అనిపించే రేంజ్‌లో కెమెరాల ముందుకు వచ్చారు రాశీ. అయితే ఈ



రేంజ్‌లో కష్టపడుతున్నా అనుకున్న రేంజ్‌లో ఆఫర్స్ అయితే రావటం లేదు. ప్రస్తుతం తెలుగులో ఒకే ఒక్క చేస్తున్నారు ఈ బ్యూటీ. హిందీలో రెండు, తమిళ్‌లో రెండు ప్రాజెక్ట్స్ రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి.

## అలాంటి వ్యక్తినే పెళ్లి చేసుకుంటా: త్రిప్తి డిమ్రి




'యానిమల్' తర్వాత చిత్ర పరిశ్రమలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు త్రిప్తి డిమ్రి ఆ సినిమాలో తన నటనతో యువ హృదయాలను కొల్లగొట్టిన ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి గురించి మాట్లాడారు. తనకు కాబోయే భర్త ఎలా ఉండాలో చెప్పారు. కొన్ని రోజులుగా త్రిప్తి పెళ్లిపై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ఆమె క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం తన ఆలోచనలన్నీ కెరీర్ పైనే ఉన్నాయని, ఇప్పుడే పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదన్నారు. తనకు కాబోయే వాడికి ఆస్తి ఉన్నా.. లేకపోయినా మంచి మనసు ఉండాలని చెప్పారు. అలాంటి వ్యక్తినే పెళ్లి చేసుకుంటానన్నారు. ఇక 'యానిమల్'లో 'జోయ' పాత్రలో ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ ఆ సినిమాతో లక్షల మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. గతంలో త్రిప్తికి 6 లక్షల మంది ఫాలోవర్స్ ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 48 లక్షలకు చేరింది. ఐఎండీబీ (ఇండియన్ మూవీ డేటాబేస్) ఇటీవల విడుదల చేసిన మోస్ట్ పాపులర్ హీరోయిన్ల జాబితాలోనూ ఆమె మొదటి స్థానంలో నిలిచారు. మరోవైపు ఆమెకు బాలీవుడ్, టాలీవుడ్‌లలో వరుస అవకాశాలు వస్తున్నాయనే వార్తలు కూడా వైరలవుతున్నాయి. కార్తీక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు తెరకెక్కిస్తోన్న 'ఆషికీ 3'లో అవకాశం వచ్చిందంటూ ప్రచారం జరుగుతోంది. విజయ్ దేవరకొండ– గౌతమ్ తిన్ననూరిల స్పై థ్రిల్లర్‌లోను ఆమె నటించనున్నట్లు తెలుస్తోంది. రవితేజ హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించనున్న చిత్రంలోనూ త్రిప్తిని ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. వీటిపై ఇంకా అధికారిక ప్రకటనలు రావాల్సి ఉంది.

# చిరంజీవి - హరీశ్ శంకర్‌ల కాంబోలో సినిమా!



పద్మవిభూషణ్ పురస్కారం అగ్ర కథానాయకుడు చిరంజీవికి ఈ ఏడాది కొత్త ఉత్సాహాన్ని చ్చింది. ఇప్పుడు అదే జోష్‌తో ఆయన వరుస సినిమాలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే తన 156వ సినిమా 'విశ్వంభర' పనుల్లో బిజీగా ఉన్న చిరు, ఇప్పుడు ఓ కొత్త ప్రాజెక్ట్ చేయనున్నారన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇండస్ట్రీకి 'గబ్బర్ సింగ్' వంటి సూపర్ హిట్‌ను అందించిన హరీశ్ శంకర్ దర్శకత్వంతో ఆయన ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ దీన్ని నిర్మించనుందని.. దీనికి సహ నిర్మాతగా సుస్మిత వ్యవహరించనున్నారని టాక్. బీవీఎస్ రవి దీనికి కథను అందించనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు చిరంజీవి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఎక్స్‌లో వీళ్లిద్దరి హ్యాష్‌ట్యాగ్‌లే ట్రెండ్ అవుతున్నాయి. చిరంజీవి అంటే తనకెంతో ఇష్టమని హరీశ్ ఎన్నో సందర్భాల్లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం చిరంజీవి 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో 'విశ్వంభర'లో నటిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన దీని ప్రచార చిత్రానికి మంచి స్పందన వచ్చింది. చిరు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకురానుంది. మరోవైపు హరీశ్ శంకర్ కూడా 'ఉస్తాద్ భగత్ సింగ్' పనుల్లో ఉన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా రానున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయిక. ఈ చిత్రంతో పాటు రవితేజతో 'మిస్టర్ బచ్చన్' రూపొందిస్తున్నారు. దీని చిత్రీకరణ ప్రస్తుతం కరైకుడిలో జరుగుతోంది. రవితేజపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఈ రెండింటి తర్వాత చిరుతో ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మస్క్ కీలక నిర్ణయం.. టెస్లా ప్రధాన కార్యాలయం తరలింపు




న్యూయార్క్: టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సంస్థ ప్రధాన కార్యాలయాన్ని డెలావర్ నుంచి టెక్సాస్‌కు తరలిస్తున్నట్లు ప్రకటించారు. టెస్లా బోర్డు డైరెక్టర్లు నిర్ణయించిన 55 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 4.5 లక్షల కోట్లు) భారీ వేతన ప్యాకేజీ అందుకునేందుకు ఎలాన్ మస్క్ అనర్హుడంటూ డెలావర్ కోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ఒక రోజు వ్యవధిలోనే తరలింపు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. తీర్పు వచ్చిన వెంటనే మస్క్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా స్పందించారు. ఈ రాష్ట్రంలో ఎవరూ తమ సంస్థలను రిజిస్టర్ చేసుకోవద్దని పిలుపునిచ్చారు. టెస్లా ప్రధాన కార్యాలయాన్ని టెక్సాస్‌కు మార్చాలా?

అని పోల్ కూడా పెట్టారు. పన్ను తక్కువగా ఉంటుందన్న కారణంతో అమెజాన్ లాంటి పెద్ద సంస్థలు ఇక్కడే తమ సంస్థలను రిజిస్టర్ చేసుకున్నాయి. మరోవైపు ఎలాన్ మస్క్ అన్ని రకాల ప్రయోజనాలు కలిపి 2018లో 55 బిలియన్ డాలర్ల వార్షిక వేతనం

అందుకున్నారు. మస్క్‌కు అధిక వేతనం చెల్లించారంటూ, టెస్లా వాటాదార్లలో ఒకరైన రిచర్డ్ టోర్నెట్టా అప్పట్లోనే డెలావర్ కోర్టును ఆశ్రయించారు. ఇంత వేతనం ఇవ్వడం కార్పొరేట్ ఆస్తులను వృథా చేయడమే అవుతుందని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

## మీరు ఎక్కడున్న ఇట్టే చెప్పేసే

# యాప్స్ ఇవి.. పూర్తి భద్రత, భరోసా..



ఫాస్ట్ ఫేసింగ్ ప్రపంచంలో మనం ఉన్నాం. ఎవరి బిజీ లైఫ్ వారిది. ఉద్యోగాలు, ప్రయాణాలు, కుటుంబ కష్టాలు, ఒత్తిళ్ల మధ్య మనిషి ఓ యంత్రంలా మారిపోయాడు. ఈ క్రమంలో స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడపడం కష్టమవుతోంది. అయితే రెండేళ్ల క్రితం కరోనా మహమ్మారి సృష్టించిన విలయం తర్వాత మనిషి ఆలోచనా దృక్పథంలో మార్పులు వచ్చాయి. కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యం పెరుగుతోంది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కొంత సమయం గడపడం ముఖ్యమైన అంశంగా పరిగణించే వారు అధికమయ్యారు. ఈ క్రమంలో వారి భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

అయితే ఎవరి పనుల్లో వారు తిరుగుతుంటారు.. ప్రయాణాలు చేస్తుంటారు. అలాంటి సమయంలో వారి భద్రతకు భరోసా, వారు ఎక్కడున్నారో, ఎలాంటి ప్రదేశంలో ఉన్నారో తెలుసుకోవడం కూడా ముఖ్యమే. అందుకే ఇటీవల కాలంలో కుటుంబ సభ్యుల ఆచూకీని ట్రాక్ చేయడం కోసం లొకేషన్ ట్రాకింగ్ యాప్స్ ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ యాప్స్ మీ ప్రియమైన వారు ఎక్కడున్నారో కచ్చితంగా రియల్ టైం అప్ డేట్లను అందిస్తాయి. మీలో ఆందోళనను తగ్గిస్తాయి. మెరుగైన సమన్వయాన్ని అందిస్తాయి.

అయితే ఆన్ లైన్లో చాలా లొకేషన్ ట్రాకింగ్ యాప్స్ ఉన్నప్పటికీ వాటిల్లో ది బెస్ట్ ఎంపికచేసుకోవడం ముఖ్యం. అందుకే బెస్ట్ లొకేషన్ ట్రాకింగ్ యాప్స్ ను మీకు పరిచయం చేస్తున్నాం. ఈ ఆండ్రాయిడ్ యాప్ కేవలం మార్గాలను ట్రాక్ చేయడానికే కాకుండా మీ ఆచూకీని స్నేహితులు, కుటుంబ సభ్యులతో పంచుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది. ఇది కాంప్లిమెంటరీ జీపీఎస్ ట్రాకింగ్ సేవలను అందిస్తుంది, వినియోగదారులు రియల్–టైం ప్లేస మోనిటరింగ్ చేసేందుకు వీలు కల్పిస్తుంది. అదనంగా, ఇది వారి గమ్యస్థానానికి చేరుకునే అంచనా సమయం గురించి వినియోగదారులను హెచ్చరిస్తుంది. ఈ జీపీఎస్ ట్రాకింగ్ అప్లికేషన్ ఆండ్రాయిడ్ పరికరాల కోసం బెస్ట్ చాయిస్. లొకేషన్ మానిటరింగ్‌తో పాటు, మీ ప్రస్తుత కదలికల గురించి స్నేహితులు, కుటుంబ సభ్యులకు నిజ సమయంలో తెలియజేస్తుంది. వ్యక్తిగతీకరించిన టెక్ట్స్ హెచ్చరికల వంటి కార్యాచరణలను అందిస్తుంది. మీ ఆచూకీని నిరంతరం అప్‌డేట్ చేయడానికి వీలు కల్పిస్తుంది. మెటా యాజమాన్యంలోని ఈ యాప్ అంతర్నిర్మిత లొకేషన్ షేరింగ్ ఫంక్షనాలిటీని కలిగి ఉంటుంది. వినియోగదారులు తాము ఎక్కడ ఉన్నది తమ కాంటాక్ట్స్, గ్రూప్స్ తో పంచుకోవచ్చు. ఒక గంట నుంచి 8 గంటల వరకు మీ లొకేషన్ నిరంతరం చూపిస్తుంది. ఈ ఫీచర్ అత్యంత సమర్థవంతమైన పద్ధతుల్లో ఒకటి. అయితే, లొకేషన్ అప్‌డేట్‌లు జరగాలంటే స్థిరమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ కావాల్సి ఉంటుంది. కుటుంబ భద్రత, లొకేషన్ షేరింగ్ కోసం నమ్మదగిన యాప్ ఆది. ఈ అప్లికేషన్ రియల్–టైమ్ లొకేషన్ షేరింగ్, క్రాష్ డిటెక్షన్, ఎస్ఓఎస్ అలర్ట్‌లు, రోడ్‌సైడ్ అసిస్టెన్స్, ఐడెంటిటీ థెఫ్ట్ ప్రొటెక్షన్ వంటి అనేక ఇతర ఫీచర్‌లను అందించడం ద్వారా భద్రతా చర్యలను క్రమబద్ధీకరిస్తుంది. ఇది మీ కుటుంబ సభ్యులతో మంచి కమ్యూనికేషన్ ను కొనసాగించడానికి, మీరు ఇంట్లో ఉన్నా, రోడ్డుపైన లేదా ప్రయాణంలోఉన్నా ముఖ్యమైన వస్తువులను సులభంగా ట్రాక్ చేయడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. ఈ అప్లికేషన్ వినియోగదారులు తమ ప్రస్తుత లొకేషన్‌ను రియల్ టైమ్‌లో కుటుంబం, స్నేహితులతో సులభంగా షేర్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. కచ్చితమైన ట్రాకింగ్ కోసం జీపీఎస్ ఫంక్షనాలిటీని పెంచడం, ఇది లొకేషన్ మానిటరింగ్ కోసం ఇతరులతో షేర్ చేయగల లింక్‌ని రూపొందిస్తుంది. అంతేకాకుండా, ఇది లొకేషన్ షేరింగ్‌కు అంకితమైన ప్రైవేట్ గ్రూప్‌లను స్థాపించడానికి వినియోగదారులను అనుమతిస్తుంది, ప్రత్యేకంగా కుటుంబ వినియోగం కోసం దీనిని రూపొందించింది.

## హలీం గింజల గురించి తెలుసా?

# ఇవి తింటే చర్మం, జుట్టు మెరిసిపోతాయి..



హలీం గింజలు అనగానే చాలా మందికి హలీమ్ గుర్తొచ్చే ఉంటుంది. కానీ ఈ గింజలు వేరు. వీటికి వంటకాలకు ఎలాంటి సంబంధం ఉండదు. వీటిని ఆలివ్ సీడ్స్ అని కూడా పిలుస్తారు. హలీం గింజల్లో ఎన్నో పోషక విలువలు, శక్తి వంతమైన ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. అవిసె గింజలు, నువ్వులు, బాదం ఇలా ఇతర నట్స్‌లాగే ఇవి కూడా అంతే. అనేక ఔషధాల్లో కూడా వీటిని ఉపయోగిస్తారు. హలీం గింజలు తింటే శరీరంలో రోగ నిరోధక శక్తి అనేది పెరుగుతుంది. హిమోగ్లోబిన్ స్థాయిలు కూడా మెరుగు పరుస్తాయి. శ్వాస కోశ సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. అలసట, జీర్ణ సంబంధిత సమస్యల్ని కూడా అదుపులోకి తీసుకు రావచ్చు. ఆయుర్వేదంలో అయితే హలీం గింజల్ని.. జుట్టు రాలడాన్ని నివారించే మందుల్లో ఉపయోగిస్తున్నారు. వీటిల్లో ఓమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా అధికంగా ఉంటాయి. గుండె ఆరోగ్యంగా ఉండేందుకు, మెదడు పనితీరు సక్రమంగా ఉండేందుకు ఓమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అవసరం. రక్త హీనత సమస్య ఉన్నవారు వీటిని తింటే.. ఈ సమస్య కంట్రోల్ అవుతుంది. ఇందులో ఐరన్ కూడా లభిస్తుంది. అంతే కాకుండా హలీం గింజల్లో లైసెన్ అని ఉంటుంది. ఇది కణజాలాలు ఆరోగ్యంగా ఉండేందుకు, కణజాలాలను మరమ్మత్తు చేస్తుంది. ముఖ్యంగా ఇందులో విటమిన్లు ఎ, ఇలు ఉంటాయి. ఈ హలీం గింజల్ని తింటే చర్మం కాంతి వంతంగా మెరిసి పోయేలా చేస్తాయి. ఇవి శరీరంలోని ఆక్సీకరణ ఒత్తిడని తగ్గిస్తాయి. కాబట్టి జుట్టు, చర్మం అందంగా ఉంటాయి.



Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**